# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com   ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433   E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 8-3-2026   NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001.   సంపుటి :32 సంచిక:167 పేజీలు:6 వెల: రూ.1/-


**నేటి కందం- నేటికి అందం**

చేతములకు చేతన నిడు
నేతగ రేవంత రెడ్డి నేటి దినమునన్
జోతలు గొన క్రీడలకై
ప్రీతిగ స్థాపించె విశ్వవిద్యాలయమున్ !!

(తెలంగాణ లో క్రీడల కోసం ఒక ప్రత్యేక విశ్వవిద్యాలయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు.)



-రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

మనదేశం యుద్ధంపై
మౌనవ్రతం ఎవరికొరకు
స్వంత అస్తిత్వమిడిచి
సాగుతుంది చివరివరకు.
అగ్రదేశ అదుపాజ్ఞలో
అణిగిమణిగే పరిస్థితి
విశ్వశాంతి మన లక్ష్యం
విలువపోయే దుస్థితి.



-వేల్పుల నారాయణ
9440433475

# మహిళల రక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి: సీఎం రేవంత్




హైదరాబాద్, మార్చి 7: మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం జేఎన్‌టీయూలో స్టాండ్ విత్ హర్ కార్యక్రమానికి సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 'స్టాండ్ విత్ హర్' బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. మహిళా దినోత్సవం జరుపుకుంటేనే బాధ్యత తీరిపోయినట్టు కాదన్నారు. మహిళా నాయకత్వం నుంచి వచ్చిన పార్టీ ద్వారా రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు.

## మహిళల పట్ల బాధ్యతల్ని నెరవేర్చాలి

మహిళలను శక్తితో పోలుస్తామని.. కుటుంబ గౌరవాన్ని కూడా మహిళలతో పోలుస్తామని సీఎం తెలిపారు. మహిళలకు వేధింపులు.. పట్టణాలు, కాలేజీలు, పబ్లిక్ ప్రాంతాలకు మాత్రమే పరిమితం కాలేదని.. సోషల్ మీడియాలో మహిళలు ఎక్కువగా వేధింపులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. 'మనల్ని మనం సవరించుకొని మహిళల పట్ల మన బాధ్యతల్ని నెరవేర్చాలి' అని సీఎం సూచించారు.

## మహిళలకు ఆర్థిక స్వావలంబన..

మహిళల రక్షణ కోసం చట్టాలు చేస్తే బాధ్యత తీరిపోయిందని అనుకోవడం తప్పని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల కేటాయింపులు, రేషన్ కార్డులు అన్నీ మహిళల పేర్లమీద ఇస్తోందన్నారు. తెలంగాణలో స్వయం సహాయక సంఘాల మహిళలకు సోలార్ పవర్ ఉత్పత్తి చేసి విద్యుత్ శాఖకు అమ్మే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిందని తెలిపారు. ఈ నిర్ణయంతో మహిళలు అదానీ, అంబానీల స్థాయిలో విద్యుత్ రంగంలో పోటీ పడే అవకాశం ఇచ్చామన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం పలు అవకాశాలు కల్పిస్తోందని సీఎం రేవంత్ వెల్లడించారు.


## మహిళల శక్తిపై సంపూర్ణ విశ్వాసం

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం ద్వారా వారి స్వేచ్ఛ పెరిగిందని సీఎం తెలిపారు. జిల్లాల్లో ప్రభుత్వ స్థలాలు కేటాయించి మహిళల చేతుల్లో పెట్రోల్ బంకులు నిర్వహించే అవకాశాలు ఇచ్చామన్నారు. దేశంలోనే తొలిసారి మహిళా యూనివర్సిటీకి వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టింది తెలంగాణ ప్రభుత్వమని చెప్పారు. రాష్ట్రంలో చీఫ్ సెక్రటరీ సహా కీలక అధికార పదవుల్లో మహిళలకు అవకాశాలు కల్పిస్తున్న ప్రభుత్వం తమదే అని అన్నారు. మహిళల శక్తి, నైపుణ్యంపై ప్రభుత్వానికి సంపూర్ణ విశ్వాసం ఉందని స్పష్టం చేశారు. తెలంగాణను దేశంలోనే మహిళలకు అత్యంత భద్రత కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

## సైబర్ నేరాలపై కఠిన చర్యలు

మహిళల రక్షణను సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సీఎం రేవంత్ అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే కుటుంబం, రాష్ట్రం, దేశం బలపడుతుందన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో మహిళలు సైంటిస్టులు, డాక్టర్లు, ఇంజనీర్లుగా రాణిస్తున్నారని తెలిపారు. మహిళలు ధైర్యంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. ఎక్కడైనా మహిళలపై వేధింపులు జరిగితే నిలబడి ప్రశ్నించే ధైర్యం సమాజంలో రావాలన్నారు. కాలేజీలు, బస్టాండ్లు సహా ఎక్కడైనా జరిగే వేధింపులను చూసీ చూడనట్టు ఉండడం కూడా నేరాన్ని ప్రోత్సహించడమే అని అన్నారు. సోషల్ మీడియా ద్వారా మహిళలపై సైబర్ వేధింపులు పెరుగుతున్నాయని తెలిపారు. మహిళలపై మార్ఫింగ్, ఫేక్ వీడియోలు వంటి సైబర్ నేరాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు.

# భారీగా మావోయిస్టుల లొంగుబాటు..31 ఏకే 47, ఆయుధాలు అప్పగింత



హైదరాబాద్, మార్చి 7:ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎదుట భారీ సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో మావోయిస్టు నేతలు దేవ్‌జీ, బడే చొక్కారావు గన్‌మెన్‌లు ఉన్నారు.అతిబిఎ డ ఒనీఇజీశ్రీ ఉబీతిటవబ

శనివారం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ రూంలో డీజీపీ శివధర్ రెడ్డి ఆధ్వర్యాన సీఎం సమక్షంలో లొంగిపోయారు. దేవ్‌జీకి చెందిన పీఎల్‌జీఏ కమిటీ మొత్తం 130 మంది 124 తుపాకులతో లొంగిపోవడం విశేషం. వీటిలో 31 ఏకే 47 తుపాకులున్నాయి. ఈ సందర్భంగా నక్సల్స్ అప్పగించిన తుపాకులను సీఎం పరిశీలించారు. లొంగిపోయిన వారిలో 125 మంది చత్తీస్‌గఢ్, 4గురు తెలంగాణకు చెందిన అజ్ఞాతంలో ఉన్నవారు , ఒకరు ఏపీకి చెందిన వారని డీజీపీ వెల్లడించారు.




# ఇరాన్ ఇంకెంతమాత్రం మధ్యప్రాచ్యాన్ని శాసించలేదు.. భారీ దాడులు తప్పవని ట్రంప్ హెచ్చరిక



వాషింగ్టన్,మార్చి 7:: అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడులతో ఓడిపోయిన దేశంగా ఇరాన్ మారిందని, ఆ దేశం ఇంకెంతమాత్రం మధ్యప్రాచ్య ప్రాంతంపై ఆధిపత్యం చలాయించే శక్తి కాదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఇరాన్ తన పొరుగుదేశాలకు క్షమాపణలు చెప్పి దాడులు ఆపేస్తామని హామీ ఇవ్వడంపై ట్రంప్ తన 'ట్రూత్ సోషల్'లో తాజా వ్యాఖ్యలు చేశారు.

దీనికి ముందు, గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలే లక్ష్యంగా దాడులు సాగిస్తూ వచ్చిన ఇరాన్ వెనక్కి తగ్గింది. గల్ఫ్ దేశాలపై జరుపుతున్న దాడులకు ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజిష్కియాన్ క్షమాపణలు చెప్పారు. ఇరుగుపొరుగు దేశాలపై క్షిపణులు, డ్రోన్ దాడులు చేసే ఉద్దేశం తమకు లేదని చెప్పారు. దీనిపై డొనాల్డ్ వెంటనే ట్రంప్ స్పందించారు.

'మధ్యప్రాచ్యంలోని పొరుగు దేశాలకు ఇరాన్ క్షమాపణ చెప్పింది. ఇంకెంతమాత్రం దాడులు చేయమంటూ దిగొచ్చింది. అమెరికా-ఇజ్రాయెల్ జరిపిన అవిశ్రాంత దాడులే ఇందుకు కారణం. మధ్యప్రాచ్యాన్ని తన అధీనంలోకి తీసుకుని పాలించాలని ఇరాన్ చూసింది. కానీ ఓడిపోయిన దేశంగా మధ్యప్రాచ్యానికి తొలిసారి క్షమాపణలు చెప్పుకుంది. ఇరాన్ ఇంకెంత మాత్రం ఆధిపత్య చెలాయించే శక్తి కాదు. మధ్య ప్రాచ్యంలో ఓడిపోయిన శక్తి' అని అన్నారు. ఇరాన్ తన చెడుప్రవర్తన కారణంగా భారీ నష్టాన్ని ఎదుర్కొంటోందన్నారు. ఆ దేశం పూర్తిగా లొంగిపోయేంత వరకూ, పతనం అయ్యేంత వరకూ ఈ పరిస్థితి కొనసాగుతుందని ట్రంప్ హెచ్చరించారు.

రెండో వారంలోకి ప్రవేశించిన యుద్ధం

ఇరాన్ యుద్ధం రెండో వారంలోకి అడుగుపెట్టింది. ఉద్రిక్తతలు తగ్గించేందుకు అటు అమెరికా-ఇజ్రాయెల్ కానీ, అటు ఇరాన్ కానీ నిరాకరిస్తున్నాయి. అయితే ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజిష్కియాన్ ఇరుగుపొరుగు దేశాలపై దాడులకు తాజాగా క్షమాపణలు చెప్పారు. ఇకపై తాము దాడులు జరపమన్నారు. అయితే ఆయా దేశాల భూభాగాల నుంచి ఇరాక్‌పై దాడులు జరపరాదని షరతు పెట్టారు. అమెరికా-ఇజ్రాయెల్ ఒత్తిళ్లకు తలవంచే ప్రసక్తే లేదన్నారు. ఇరాన్ ప్రజలు ఎన్నడూ లొంగిపోరని, ఇరాన్‌ను లొంగదీసుకోవచ్చని అనుకునే వాళ్లు ఎప్పటికీ సక్సెస్ కారని, తమ దేశాన్ని తాము కాపాడుకుంటామని మీడియాతో మాట్లాడుతూ ఆయన చెప్పారు

# ఇరాన్ యుద్ధ నౌకపై అమెరికా దాడికి ముందు.. మరో ఇరాన్ యుద్ధ నౌకకు భారత్ ఆశ్రయం

న్యూఢిల్లీ, మార్చి 7:ఇరాన్ యుద్ధ నౌక ఐరిస్ దేనాపై అమెరికా సబ్‌మెరైన్ దాడి చేసి సముద్రంలో ముంచేసింది. అయితే దీనికి ముందు మరో ఇరాన్ యుద్ధ నౌక ఐరిస్ లావన్ (ఎఖీఎూ ఒజీలజీని)కు భారత్ ఆశ్రయం ఇచ్చింది. ప్రస్తుతం అది కొచ్చిలో సురక్షితంగా ఉన్నది. విశాఖపట్నంలో జరిగిన నేవీ విన్యాసాల్లో ఇరాన్‌కు చెందిన వార్ షిప్‌లు పాల్గొన్నాయి. ఆ తర్వాత రెండు యుద్ధ నౌకలు ఇరాన్‌కు బయలుదేరాయి.

కాగా, ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ దళాలు ఉమ్మడిగా ఇరాన్‌పై దాడులు చేశాయి. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ ఈ దాడిలో హతమయ్యారు. ఈ నేపథ్యంలో ఉద్రిక్తతలు పెరిగాయి. ఆ సమయంలో హిందూ మహా సముద్ర జలాల్లో ఉన్న ఇరాన్ యుద్ధ నౌక ఐరిస్ లావన్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో భారత్ సహాయాన్ని ఇరాన్ కోరింది. కొచ్చిలో డాకింగ్ కోసం అనుమతి అడిగింది. మార్చి 1న ఆమోదం లభించింది. దీంతో మార్చి 4న ఐరిస్ లావన్ కొచ్చిలో డాకింగ్ చేసింది. ఈ నౌకలోని 183 మంది సిబ్బంది ప్రస్తుతం కొచ్చిలోని నేవల్ బేస్‌లో వసతి పొందుతున్నట్లు భారత్ పేర్కొంది.మరోవైపు ఇరాన్‌కు తిరిగి వెళుతున్న మరో యుద్ధ నౌక ఐరిస్ దేనాను అమెరికా జలాంతర్గామి టార్గెట్ చేసింది. మార్చి 4న టార్పెడోతో దానిని పేల్చివేయడంతో హిందూ మహాసముద్రంలో మునిగిపోయింది. శ్రీలంక తీరం సమీపంలో ఈ సంఘటన జరగడంతో ఆ దేశ నేవీ, ఎయిర్‌ఫోర్స్ అప్రమత్తమయ్యాయి. ఐరిస్ దేనాలోని సుమారు 130 మందిలో 80 మందికిపైగా సిబ్బంది మరణించగా 32 మందిని కాపాడారు. శ్రీలంకలోని ఆసుపత్రిలో వీరు చికిత్సపొందుతున్నారు.






# గద్దర్ అవార్డుల ప్రకటన.. చిరంజీవికి 'ఎన్టీఆర్ నేషనల్' అవార్డ్

హైదరాబాద్, మార్చి 7: గద్దర్ సినీ అవార్డులను తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. ఈ ప్రకటన సినీ వర్గాల్లో, అభిమానుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. గతేడాది ప్రారంభమైన ఈ పురస్కారాల పరంపర, ఈసారి మరిన్ని ప్రతిష్ఠాత్మక విభాగాలతో ముందుకు వచ్చింది. ముఖ్యంగా మెగాస్టార్ చిరంజీవికి 'ఎన్టీఆర్ నేషనల్' అవార్డు ప్రకటించడం విశేషం.

తెలంగాణ ప్రభుత్వం నంది అవార్డుల స్థానంలో సినీ కళాకారులకు గద్దర్ అవార్డులను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. దాదాపు దశాబ్ద కాలంపాటు నిలిచిపోయిన ప్రభుత్వ పురస్కారాల సంప్రదాయం రేవంత్‌రెడ్డి సర్కార్‌లో మళ్లీ ప్రారంభం కావడంతో కళాకారులకు ఎంతగానో ప్రోత్సాహంగా ఉందని సినీ ప్రముఖులు చెబుతున్నారు. ఈసారి ఉగాది రోజున సినీతారల సందడితో ఈ వేడుకను అత్యంత వైభవంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్వహించనుంది.

## విజేతల పూర్తి వివరాలివే..

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్' రెండో విడత విజేతలను జ్యూరీ కమిటీ ప్రకటించింది. ఈ ఏడాది అవార్డుల్లో దిగ్గజ నటీనటులు, సాంకేతిక నిపుణులకు పెద్ద పీట వేశారు. ఈ ఏడాది వివిధ విభాగాల్లో ఎంపికైన ప్రముఖుల జాబితాను ప్రకటించింది.

## స్పెషల్ అవార్డులు

ఎన్టీఆర్ జాతీయ అవార్డు - చిరంజీవి

రఘుపతి వెంకయ్య అవార్డు - రమేష్ ప్రసాద్

పైడి జయరాజ్ అవార్డు - కమల్ హాసన్

నాగిరెడ్డి చక్రపాణి అవార్డు - అశ్వనీదత్

ఏఎన్ఆర్ అవార్డు - జయసుధ

టీఎల్.కాంతారావు అవార్డు - ఆర్.నారాయణ మూర్తి

సి.నారాయణ రెడ్డి అవార్డు - సుద్దాల అశోక్ తేజ

బీఎన్ రెడ్డి అవార్డు - సింగీతం శ్రీనివాసరావు

# శాంతియుత వాతావరణంలోనే సమస్యకు పరిష్కారం: సీఎం రేవంత్



హైదరాబాద్, మార్చి 7: 130 మంది మావోయిస్టులు శనివారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎదుట లొంగిపోయారు. దేవ్‌జీకి చెందిన పీఎల్‌జీఏ కమిటీ మొత్తం సరెండర్ అయిపోయింది. మావోయిస్టులు తమ ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. మొత్తం 124 ఆయుధాలను సరెండర్ చేశారు. లొంగిపోయిన వారిలో దేవ్‌జీ, బడే చొక్కారావు గన్‌మెన్లు కూడా ఉన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..

'శాంతియుత వాతావరణంలోనే సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. లొంగిపోయిన మావోయిస్టుల ఆర్థిక, ఆరోగ్య భద్రతకు భరోసా కల్పిస్తాం. ఇంకా అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు లొంగిపోవాలి. లొంగిపోయిన మావోయిస్టులకు అవసరమైన వసతులు కల్పిస్తాం. మావోయిస్టుల లొంగుబాటుకు అధికారులు తీవ్ర కృషిచేశారు. పోలీసులు మావోయిస్టుల్లో నమ్మకం కల్పించారు. దేవ్‌జీ, ఆయన మిత్రబృందం కొన్ని ప్రతిపాదనలు చేశారు. తమ సమస్యలు పరిష్కరిస్తే లొంగిపోతామని చెప్పారు'. రాష్ట్ర స్థాయిలో మేం చేయగలిగిందంతా చేస్తాం. మావోయిస్టు అగ్రనేత గణపతి లొంగిపోవాలి. అజ్ఞాతంలో ఉన్న తెలంగాణకు చెందిన ఏడుగురు కూడా.. త్వరగా లొంగిపోవాలి. లొంగిపోయిన వారికి పునరావాసం కల్పించాలని అమిత్ షా చెప్పారు. లొంగిపోయిన మావోయిస్టులకు రివార్డు కూడా అందజేస్తాం. ప్రత్యేకమైన ఆరోగ్య భద్రత కార్డులు ఇస్తాం' అని రేవంత్ రెడ్డి హామీ చెప్పారు.

## మావోయిస్టులకు ఇందిరమ్మ ఇళ్లు..

తెలంగాణలో మావోయిస్టుల లొంగుబాటు పరంపర కొనసాగుతోంది. 130మంది మావోయిస్టులు శనివారం నాడు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎదుట లొంగిపోయారు. దేవ్‌జీకి చెందిన పీఎల్‌జీఏ కమిటీ మొత్తం లొంగిపోయారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 'లొంగిపోయిన మావోయిస్టులకు అవసరమైన వసతులు కల్పిస్తాం. మావోయిస్టుల హోదాలను బట్టి ప్యాకేజీ ఇస్తాం. ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇల్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది' అని అన్నారు.

# ఖమేనీ మృతిపై నిరసనలు, ఉద్రిక్తత.. కాశ్మీర్‌లో వారం తర్వాత ఆంక్షల తొలగింపు

న్యూఢిల్లీ, మార్చి 7: ఇరాన్ అధ్యక్షుడు అయతొల్లా ఖమేనీ మృతితో కాశ్మీర్‌లో ముస్లింలు చేపట్టిన నిరసన ప్రదర్శన ఆందోళనకు దారితీసిన సంగతి తెలిసిందే. దీంతో అక్కడి పోలీసులు, భద్రతా బలగాలు ఆంక్షలు విధించారు. అయితే, శనివారం నుంచి ఆంక్షల్ని పూర్తిగా ఎత్తివేశారు. దీంతో అక్కడ జనజీవనం సాధారణ స్థితికి చేరుకుంది. గతవారం ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడి చేశాయి. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మరణించారు.

ఈ దాడుల్ని, ఖమేనీ మరణాన్ని వ్యతిరేకిస్తూ జమ్మూ కాశ్మీర్ ప్రాంతంలోని షియా తెగ ముస్లింలు నిరసన చేపట్టారు. ఈ నిరసన ప్రదర్శనలు ఆదివారం బాగానే సాగాయి. అయితే, సోమవారం శ్రీనగర్‌లోని లాల్ చౌక్ వద్దకు భారీగా నిరసనకారులు వచ్చేందుకు ప్రయత్నించారు. ఇది సమస్యాత్మక ప్రాంతం కావడంతో పోలీసులు, భద్రతా బలగాలు వారిని అడ్డుకున్నాయి. దీంతో ఆందోళనకారులు మరింత ఆగ్రహానికి గురయ్యారు. పోలీసులపై రాళ్లు రువ్వారు. షాపుల్ని ధ్వంసం చేశారు. ఆ సమయంలో పోలీసులు, భద్రతా దళాలు కలిసి ఆందోళనకారుల్ని చెదరగొట్టాయి. టియర్ గ్యాస్ ప్రయోగించాల్సి వచ్చింది. మళ్లీ అలాంటి ఘటనలు జరగకుండా ఈ ప్రాంతంలో ఆంక్షలు విధించారు. భారీగా బలగాల్ని మోహరించారు. చారిత్రక లాల్ చౌక్‌ను చుట్టూ కంచెలు, బారికేడ్లు ఏర్పాటు చేసి మూసేశారు.

# సృష్టిలో సగం మహిళ - సమానత్వంలో ఆమె ఎక్కడ !

## (08 మార్చి "అంతర్జాతీయ మహిళా దినోత్సవం" సందర్భంగా)

సృష్టిలో సగం ఆమె. ఆమే కదా సంతాన లక్ష్మి. ఇంటి గడపకు పసుపు పారాణి ఇల్లాలు. గృహ పందిరికి ఆమె ఆకుపచ్చ మామిడి తోరణం. సంసార సంద్రంలో ఆమె ఒక నిర్మల ప్రశాంత అల. నవ్వులు పంచే త్యాగమయి అర్ధాంగి. ఆర్థికాభివృద్ధికి ఐశ్వర్య లక్ష్మి. గృహ కోవెలలో కొలువైన దేవత. ఆమె లేనిదే ఇంట్లో క్షణమైన గడవదు. గళం విప్పకుండా అవిశ్రాంతంగా శ్రమ చేసే పని రాక్షసి ఆమె. ఆకాశమంత ఓపిక, భూదేవి అంత సహనం ఆమె స్వంతం. ఆమె కుటుంబ సంక్షేమ నిధి. మగాడి గుండె సవ్వడి. ఆమె లేనిదే అన్నం ముద్ద దిగదు. ఆమె అలిగితే గృహమంతా అంధకారం. మహిళ మహిమాన్విత శక్తి రూపిణి. అష్ట లక్ష్ముల నిలువెత్తు రూపం అతివ. పురుషాధిక్య సమాజానికి తల్లి వేరు పడతి. అందరి శ్రేయస్సు కోరే ఆది లక్ష్మి. పట్టుదలకు ఆమె ప్రతిరూపం. సహనశీల మహిళ గృహసీమకు సంతోషాల హరివిల్లు. అన్నీ తానై ఇంటిని నడిపించే అతివ చుట్టూ అన్నీ ముళ్ల కంచెలే. ఇల్లే స్వర్గం అయిన వనితకు వంటిల్లు నిర్బంధ కారాగారం. ఆమె జీవితం కష్టనష్టాలు నిండిన దుఃఖ సాగరం. లింగ వివక్ష కోరల్లో చిక్కుకున్న మహిళ సమస్యల సుడిగుండంలో అనాదిగా కొట్టుమిట్టాడుతూనే ఉంటున్నది.

లింగ సమానత్వం, సాధికారతలకు పట్టం కడదాం:

ప్రపంచ మహిళ ఎదుర్కొంటున్న సమస్యలు ఎన్నో, సవాళ్లు మరెన్నో. లింగ వివక్ష, గృహ హింస. వరకట్న దురాచారం, బాల్య (బాలికల) వివాహాలు, లైంగిక వేధింపులు, మానభంగ పర్వాలు, అవిద్య, అనారోగ్యం, పోషకాహార లోపం, వృత్తి ప్రదేశంలో వేధింపులు, ఆర్థిక అసమానతలు, రాజకీయ రంగంలో అసమానతలు, మీడియాల్లో ఆమె అశ్లీల వస్తువు, ఆడ శిశువు వద్దంటూ భ్రూణహత్యలు, కుటుంబం/సమాజంలో ద్వితీయ శ్రేణి పాత్ర, పురుషాధిక్య సమాజంలో నలుగుతున్న ప్రాణి, కొరవడిన ఆర్థిక స్వేచ్ఛ, సామాజిక కట్టుబాట్లలో మగ్గుతున్న బక్క జీవి, ఉద్యోగ ఉపాధుల్లో వెనుకబాటు లాంటి పలు సవాళ్లను ఎదుర్కొంటున్న మహిళ నేడు గోరంత అభివృద్ధిని సాధించినా ఇంకా కొండంత సాధించాల్సి ఉన్నది. ప్రపంచ మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను గుర్తించిన పౌర సమాజం 1909 నుంచే "జాతీయ మహిళా దినం" పాటిస్తున్నప్పటికీ 1975 నుంచి ఐరాస నేతృత్వంలో ''అంతర్జాతీయ మహిళా దినోత్సవం(ఇంటర్నేషనల్ వూమెన్స్ డే)" నిర్వహించుట జరుగుతున్నది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం-2026 ఇతివృత్తంగా "హక్కులు, న్యాయం, చర్యలు : బాలికలు, మహిళలు అందరికీ" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం కొనసాగుతున్నది.

గ్లోబల్ జెండర్ గ్యాప్ ఇండెక్స్-2025 జాబితాలో 131వ స్థానం:

నిత్య జీవితంలో మహిళల పాత్రను గుర్తిస్తూ వారికి పురుషులతో సమానంగా అవకాశాలను కల్పించడం, ఉన్నత విద్యలో వారికి పెద్ద పీట వేయడం, ఆమె ఆరోగ్య పరిరక్షణకు ఊతం ఇవ్వడం, ప్రపంచాభివృద్ధిలో ఆమెను భాగం చేయడం, ఆమె మాటకు విలువ ఇవ్వడం, అన్ని రంగాల్లో ఆమె చేతికి నాయకత్వ పగ్గాలు అందించడం, ఉద్యోగ ఉపాధుల్లో చేయూత ఇవ్వడం, లింగ వివక్షకు దూరంగా సమానత్వ బీజాలు నాటి పెంచి పోషించడం నిరంతరం వేగంగా జరగాలి. ఆమెలో దాగిన అపార శక్తిని సుస్థిరాభివృద్ధికి వినియోగించాలి. 'గ్లోబల్ జెండర్ గ్యాప్-2025' నివేదిక ప్రకారం 148 దేశాల జాబితాలో భారత్ స్థానం 131 ఉండడం విచారకరం. భారత్‌లో 39 శాతం మహిళలు సెకండరీ విద్యను పూర్తి చేయడం, శ్రామిక లోకంలో 27.2 శాతం మహిళలు మాత్రమే ఉండడం బాధాకరం, ఆక్షేపణీయం.

అమ్మ కారణంగా జన్మించిన మగాడు ఆమెను విస్మరిస్తే పుట్టగతులు ఉండవు. మహిళలో మహాలక్ష్మిని దర్శిస్తూ, స్త్రీలో ఐశ్వర్యాన్ని చూస్తూ, అమ్మతనానికి తలవంచి నమస్కరిద్దాం, ఆమెను పువ్వుల్లో పెట్టుకొని చూసుకుందాం. ఆమెలో సరస్వతి, లక్ష్మి, దుర్గలను దర్శిస్తూ సదా అతివకు అనంత అవకాశాలను అందిద్దాం. మహిళలకు సమాన హక్కులు కల్పించాల్సిన కనీస కర్తవ్యం పురుష పుంగవుల మీదనే ఆధారపడి ఉందని గమనించి ఆ దిశగా వడివడిగా అడుగులు వేద్దాం, ఆమెకు సముచిత స్థానం కల్పిద్దాం.



-ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలకు చెందిన టోల్ ప్లాజాల్లో

## 5,100 కన్నా ఎక్కువ మంది మహిళా సిబ్బందిని నియమించిన ఎన్‌హెచ్ఏఐ

న్యూఢిల్లీ, మార్చి 7:టోల్ కార్యకలాపాల నిర్వహణలో మహిళలకు సాధికారత కల్పననీ, సమ్మిళితత్వాన్నీ ప్రోత్సహించే లక్ష్యంతో దేశంలోని జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వే వ్యవస్థకు సంబంధించిన 1,140 కన్నా ఎక్కువ టోల్ ప్లాజాల్లో పగటి పూట షిఫ్టులలో 5,100 మందికి పైగా మహిళా సిబ్బందిని ఎన్‌హెచ్ఏఐ నియమించింది. జాతీయ రహదారులపై ప్రయాణించే వారికి సమర్థమైన, సహానుభూతి పూర్వకమైన, వినియోగదారులకు అనుకూలంగా ఉండే వాతావరణాన్ని ప్రోత్సహిస్తూ, జాతీయ రహదారి ప్రయాణికులకు మెరుగైన అనుభూతిని అందించడం, జాతీయ రహదారుల టోల్ ప్లాజాల్లో వివాదాలకు ఆస్కారాన్ని తగ్గించడం.. ఇవి ముందు వరుసలోని నిర్వహణ సంబంధిత విధుల్లో కేవలం మహిళా సిబ్బందిని నియమించడంలో ప్రధానోద్దేశాలుగా ఉన్నాయి.

టోల్ ప్లాజా నిర్వాహకులు, నేషనల్ హైవేస్ బిల్డర్ ఫెడరేషన్ (ఎన్‌హెచ్‌బీఎఫ్), హైవే ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (హెచ్ఓఏఐ)తో పాటు ఆలిండియా యూజర్ ఫీ కాంట్రాక్టర్స్ ఫెడరేషన్ (ఏఐయూసీఎఫ్) వంటి కీలక పరిశ్రమ సంఘాలు సహా వివిధ ఆసక్తిదారులతో సంప్రదింపుల్నీ, చర్చల్నీ జరిపిన తరువాత ఈ నిర్ణయం తీసుకున్నారు. టోల్ ప్లాజాల్లో వినియోగదారుల నుంచి రుసుమును వసూలు చేయడానికి పగటి షిఫ్టులో మహిళా సిబ్బందిని నియమించడానికి టోల్ ఆపరేటర్లంతా సమ్మతిని తెలియజేశారు. 5,100 కన్నా ఎక్కువ మహిళా టోల్ సిబ్బందిని ఇప్పటికే నియమించారు. త్వరలో మరింత మంది కూడా చేరే అవకాశం ఉంది.

నిర్దేశిత నియమాల ఆచరణను నిర్ధరించడానికి ఈ కార్యక్రమం అమలు తీరును ఎన్‌హెచ్ఏఐ నిశితంగా పర్యవేక్షిస్తుంది. ఈ కార్యక్రమం మహిళలకు, ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లోనూ, సెమీ-అర్బన్ ప్రాంతాల్లోనూ ఉద్యోగావకాశాల్ని కల్పించడంలో సాయపడుతుంది. దీంతో పాటు, జాతీయ రహదారులకు సంబంధించిన మౌలిక సదుపాయాల కల్పన రంగంలో వారు పాలుపంచుకోవడాన్ని బలోపేతం చేయడమే కాక, ఈ దూర ప్రాంతాలలో ఉపాధి కల్పనకు తోడ్పడుతుంది.

ఈ కార్యక్రమంలో భాగంగా, విధుల్లో నియమించిన మహిళా సిబ్బందికి మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారికి ప్రత్యేక శిక్షణనిచ్చేందుకు కూడా ఎన్‌హెచ్ఏఐ తగిన ఏర్పాట్లు చేస్తుంది. ఈ శిక్షణలో.. జాతీయ రహదారులను ఉపయోగించుకొనే వారితో వినమ్రంగా వ్యవహరించడం, అత్యవసర స్థితుల్ని సమర్థంగా ఎదుర్కోవడం, ప్రాథమిక భద్రతా ప్రోటోకాల్స్ పట్ల అవగాహన కలిగించడంతో పాటు టోల్ ప్లాజాను సమర్థంగా నిర్వహించడంపై దృష్టిని కేంద్రీకరిస్తారు. సామర్థ్యాల పెంపుదల దిశగా చేపట్టిన ఈ వ్యవస్థీకృత ప్రయత్నం సురక్షితమైన, వృత్తికుశలతతో కూడిన పని పరిస్థితుల్ని ఏర్పరుస్తూ, సేవల నాణ్యతను పెంచడంలో కూడా తోడ్పడనుంది.

ముందువరుసలో నిలబడి పూర్తి చేయాల్సిన పనుల్లో మహిళల ప్రవేయాన్ని మరింతగా ప్రోత్సహించడం ద్వారా సామాజిక సాధికారతతో పాటు మహిళలకూ అవకాశాల కల్పనని పెంపొందింప చేస్తూనే, దేశమంతటా జాతీయ రహదారుల టోల్ ప్లాజాల్లో సేవల లభ్యతను మెరుగుపరచాలని ఎన్‌హెచ్ఏఐ లక్ష్యంగా పెట్టుకుంది.

# 2025-26 సంవత్సరానికి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల్లో భారత్ విజయాలు


న్యూఢిల్లీ, మార్చి 7:అంతర్జాతీయ వాణిజ్య యవనికపై కొత్త వర్ణాలను ఆవిష్కరిస్తూ, ఈ రంగానికి సరికొత్తగా దిశానిర్దేశం చేస్తూ, ఆధునిక - భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నవతరం స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలకు రూపకల్పన చేస్తూ... గడిచిన దశాబ్ద కాలంలో అత్యంత నిశ్చయాత్మక, ఆత్మవిశ్వాసం కలిగిన శక్తిగా భారత్ అవతరించింది.

గడిచిన కొన్ని సంవత్సరాలుగా భారత్ తన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పంద వ్యవస్థను స్థిరంగా విస్తరిస్తూ.. ప్రస్తుతం 38 దేశాలతో 9 కీలక ఒప్పందాల స్థాయికి చేరింది. 2021లో భారత్ - మారిషస్ ఒప్పందంతో ప్రారంభమైన ఈ ప్రయాణం.. 2022 మే నెలలో భారత్ -యూఏఈ సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందంతో ముందుకు సాగింది. 2022 డిసెంబరులో భారత్ - ఆస్ట్రేలియా ఆర్థిక, వాణిజ్య ఒప్పందం అమల్లోకి వచ్చింది. 2024 మార్చి 10న భారత్ సంతకం చేసిన ఈఎఫ్టీఏ వాణిజ్య ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం.. 2025 అక్టోబరు 1న అమల్లోకి వచ్చింది. అనంతరం 2025 జూలైలో భారత్ - యూకే సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందంపైనా, అలాగే 2025 డిసెంబరులో భారత్ - ఒమన్ సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందంపైనా సంతకాలు జరిగాయి. ఈ క్రమంలో 2025 డిసెంబరు22న భారత్ - న్యూజిలాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్నీ, అనంతరం 2026 జనవరి 27న భారత్ - ఐరోపా యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్నీ ప్రకటించారు. 2026 ఫిబ్రవరి 7న అమెరికాతో మధ్యంతర ఒప్పందానికి సంబంధించిన ముసాయిదాను ఖరారు చేసి.. అంతర్జాతీయ వాణిజ్య రంగంలో భారత్ తన ఉనికిని మరింత సుస్థిరం చేసుకుంది.

భారత్ కుదుర్చుకున్న ఈ ఒప్పందాలన్నీ ఎంతో విశిష్టమైనవి. మన దేశ మార్కెట్ పరిమాణాన్నీ, మన ఆర్థిక సామర్థ్యాన్నీ, 140 కోట్ల భారతీయుల సామర్థ్యంపై ప్రపంచానికి ఉన్న నమ్మకానికి లభించిన గుర్తింపు ఇది.

ఈ వాణిజ్య ఒప్పందాలు మన దేశ రైతుల ఉత్పత్తులకు అభివృద్ధి చెందిన దేశాల మార్కెట్లలో ప్రవేశం కల్పిస్తాయి. వస్త్రాలు, తోలు వస్తువులు, హస్తకళలను ఎగుమతి చేసే మహిళా పారిశ్రామికవేత్తలకు, ఎంఎస్ఎంఇలకు వెన్నుదన్నుగా నిలుస్తూ సరికొత్త పోటీతత్వాన్ని వారిలో నింపుతాయి. అలాగే భారతీయ యువతకు, విద్యార్థులకు, ఐటీ నిపుణులూ, షెఫ్‌లూ, యోగా శిక్షకుల వంటి నిపుణులకు విదేశాల్లో చదువుకోవడానికి, ఉపాధి పొందడానికి, భవిష్యత్తును నిర్మించుకోవడానికి ఈ ఒప్పందాలు సుగమం చేస్తున్నాయి.

# యుక్త ధార సాఫ్ట్వేర్ పోర్టల్ ఉపాధి పనులు




అమరావతి, మార్చి 7:ఈ ఏడాది ఏప్రిల్ ఒకటవ తారీఖు నుండి వి.బి జి రామ్ జీ పథకం యుక్త ధార సాఫ్ట్వేర్ పోర్టల్ ద్వారా (ఉపాధి పనులు) చేయించడం జరుగుతుందని వి.బి జి రాంజీ ఎపిడి ఎల్.రాంబాబు పేర్కొన్నారు. శనివారం రంపచోడవరం ఐటీడీఏ సమావేశపు హాల్లో పోలవరం జిల్లాలోని 12 మండలాలకు సంబంధించిన ఏపీఓ లతో, ఈసీలతో, జేఈ లతో, బి ఎఫ్ టి లతో యుక్త ధార సాఫ్ట్వేర్ పోర్టల్ విధివిధాలపై శిక్షణ కార్యక్రమం వి.బి జి రామ్ జీ పథక ఎ పి డి లు ఎల్ .రాంబాబు, శ్రీకాంత్, సి ఆర్ డి టెక్నికల్ పర్సన్ సునీల్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా వి. బి జి రాంజీ పథక ఎపిడి ఎల్ రాంబాబు మాట్లాడుతూ వి. బి జీ రాంజీ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి ఈ సంవత్సరం ఒకటో తారీకు నుండి ప్రతి కుటుంబానికి125 రోజులు పనులు కల్పించే విధంగా ప్రభుత్వం నుండి అనుమతులు రావడం జరిగిందని ఆయన తెలిపారు. వి. బి జి రాంజీ పథకం ద్వారా యుక్త ధార సాఫ్ట్వేర్ పోర్టల్ ద్వారా ప్రతి పనికి అనుసంధానం చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ పనులుకు సంబందించి పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ద్వారా ఈ శిక్షణ ఇవ్వడం జరిగింది అని ఆయన తెలిపారు. మంజూరైన పనులు ఎప్పటికప్పుడు పరివేక్షించి సకాలంలో పూర్తి చేయించే బాధ్యత మనందరిపై ఉందని ఆయన తెలిపారు.

ఈ సంవత్సరం ఏప్రిల్ నెల నుండి గుర్తించిన కొత్త పనులను మంజూరైన వెంటనే పనులు ప్రారంభించడం జరుగుతుందని ఆయన అన్నారు. వి. బి జి రామ్ జి పథకం ద్వారా ముఖ్యంగా జల సంరక్షణ పనులు, గ్రామీణ మౌలిక వసతులకు సంబంధించిన పనులు, జీవన ఉపాధిలో మెరుగుదలకు సంబంధించిన పనులు, పకృతి వైపరీత్యాలను ఎదుర్కొనే పనులకు ముఖ్య ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని ఆయన అన్నారు. పోలవరం జిల్లాలోని 12 మండలాలకు సంబంధించిన ప్రతి గ్రామంలో యుక్త ధార సాఫ్ట్వేర్ పోర్టల్ విధివిధానాలు పై అవగాహన కల్పించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

వి. బి జి రామ్ జీ పథకం ద్వారా ఈ ప్రాంత అభివృద్ధికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట వేయడం జరిగిందని అదేవిధంగా ప్రతి కుటుంబానికి 125 రోజులు ఉపాధి పనులు కల్పించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవోలు సురేష్ కుమార్, ప్రకాష్, సాయిబాబా, సత్యనారాయణ, చిరంజీవి, మణి కుమారి, స్వామి, శ్రీనివాస్, రాఘవయ్య, శ్యాం రాజు, అరవాలు, ఈసీలు, జేఈలు, టి ఏ లు, బిఎఫ్ టీలు తదితరులు పాల్గొన్నారు.

# సబ్కా సాథ్, సబ్కా వికాస్ - ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం..

## "విద్య, నైపుణ్యాలు, యూనివర్సిటీ టౌన్‌షిప్‌లు" అనే అంశంపై మార్చి 9న బడ్జెట్ వెబినార్

న్యూఢిల్లీ, మార్చి 7:కేంద్ర బడ్జెట్ 2026?27లో ప్రకటించిన కీలక కార్యక్రమాలపై చర్చించేందుకు ఉన్నత విద్యా శాఖతో కలిసి సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ (ఎంఐబీ) "సబ్కా సాథ్, సబ్కా వికాస్ - ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం: విద్య, నైపుణ్యాలు, యూనివర్సిటీ టౌన్‌షిప్‌లు'' అనే అంశంపై బడ్జెట్ అనంతర వెబినార్‌లో పాల్గొంటుంది. భారతదేశ విద్య, నైపుణ్యాలు, సృజనాత్మక ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేసే అమలు మార్గాలపై చర్చించేందుకు ఈ వెబినార్ విధాన నిర్ణేతలు, పరిశ్రమల అధిపతులు, విద్యావేత్తలు, స్టార్టప్‌లు, విద్యార్థులను ఒక వేదికపై చేరుస్తుంది.

మార్చి 9న ఉదయం 11:30 గంటలకు గౌరవ ప్రధాన మంత్రి వెబినార్ ప్రారంభ సమావేశంలో పాల్గొంటారు.

వృద్ధి, ఉద్యోగాలు, సాఫ్ట్ పవర్‌ను పెంపొందించేలా సృజనాత్మకత, సంస్కృతి, సాంకేతికత కలిసే ఏవీజీసీ - క్రియేటర్ ఎకానమీ బడ్జెట్ లక్ష్యాలను వివరిస్తూ ఆయన ప్రత్యేక ప్రసంగం చేస్తారు.




మధ్యాహ్నం 12:20 నుంచి 01:50 వరకు ఏవీజీసీ కంటెంట్ క్రియేటర్ ల్యాబ్స్‌పై సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ప్రత్యేక సెషన్

వెబినార్‌లో భాగంగా, సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ "పాఠశాలలు, కళాశాలల్లో ఏవీజీసీ కంటెంట్ క్రియేటర్ ల్యాబ్స్" అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది.

ఈ కార్యక్రమంలో 15,000 పాఠశాలలు, 500 ఉన్నత విద్యా సంస్థల్లో ఏవీజీసీ కంటెంట్ క్రియేటర్ ల్యాబ్స్ (సీసీఎల్) ఏర్పాటుపై కేంద్ర బడ్జెట్ ప్రతిపాదనను అమలు చేయడంపై దృష్టి సారిస్తుంది.

సృజనాత్మక ప్రతిభను ప్రోత్సహించడం, భారత యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ (ఏవీజీసీ) వ్యవస్థను బలోపేతం చేయడం, దేశంలో వేగంగా విస్తరిస్తున్న ఆరెంజ్ ఎకానమీ కోసం నైపుణ్యం కలిగిన ఆవిష్కర్తలను సిద్ధం చేయడం దీని ప్రధాన లక్ష్యం.

మధ్యాహ్నం 12:20 నుంచిన 01:50 వరకు జరిగే "పాఠశాలలు, కళాశాలల్లో ఏవీజీసీ కంటెంట్ క్రియేటర్ ల్యాబ్స్" ప్రత్యేక సెషన్‌కు విజిలింగ్ వుడ్స్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు, సీటీఓ శ్రీ చైతన్య చింక్లికర్ సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. ఈ కార్యక్రమ ప్రాముఖ్యతను వివరిస్తూ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు ప్రధాన ప్రసంగం చేస్తారు.

ఈ సెషన్‌లో భాగంగా ప్రభుత్వ, పరిశ్రమ నిపుణులతో ప్యానెల్ చర్చ జరుగుతుంది. ఇందులో స్కూల్ ఎడ్యుకేషన్ అండ్ లిటరసీ డిపార్ట్‌మెంట్ అడిషనల్ సెక్రటరీ శ్రీ ధీరజ్ సాహు, ఫిక్కీ ఏవీజీసీ ఫోరమ్ ఛైర్మన్ డాక్టర్ ఆశిష్ కులకర్ణి, జెట్‌సింథసిస్ వ్యవస్థాపకుడు, గ్రూప్ సీఈఓ శ్రీ రాజన్ నవాని, వైగర్ సీఈఓ సోనమ్ భగత్‌తో పాటు ఐఐసీటీ నుంచి ఒక విద్యార్థి ప్రతినిధి పాల్గొంటారు. ఈ చర్చలో శ్రీ ముంజాల్ ష్రాఫ్ (గ్రాఫిటీ మల్టీమీడియా), శ్రీ బిరెన్ ఘోష్ (టెక్నికలర్ గ్రూప్), శ్రీ మన్వేంద్ర శుకుల్ (లక్ష్య డిజిటల్), శ్రీమతి మాలా శర్మ (అడోబ్ ఇండియా), శ్రీమతి ప్రీతి వ్యాస్ (అమర్ చిత్ర కథ)తో పాటు మైభారత్‌కు చెందిన ఇద్దరు యువ వాలంటీర్లు కూడా పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకుంటారు.

వెబినార్ వివరాలను ముగింపు సమావేశంలో సంక్షిప్తంగా వివరిస్తారు.

సాయంత్రం 05:25 గంటలకు గౌరవ సమాచార, ప్రసార శాఖ మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్ ప్రత్యేక ప్రసంగం చేస్తారు.

విద్యా సంస్థలు, పరిశ్రమల సంఘాలు, స్టార్టప్‌లు, క్రియేటర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఏవీజీసీ రంగ నిపుణులు ఈ వెబినార్‌లో చేరి చర్చల్లో పాల్గొనవలసిందిగా కోరారు.

ఈ వెబినార్ ద్వారా యువ భారతీయులకు సృజనాత్మక, డిజిటల్ నైపుణ్యాలను అందించడం, ఏవీజీసీ రంగంలో భారత్‌ను ప్రపంచ అగ్రగామిగా నిలబెట్టడం లక్ష్యంగా ఉన్న 'ఏవీజీసీ కంటెంట్ క్రియేటర్ ల్యాబ్స్' అమలుకు అవసరమైన కార్యాచరణ, భాగస్వామ్య వ్యూహాలు వెలువడుతాయని భావిస్తున్నారు.

# ఘనంగా ఎంవీ కృష్ణారావు శత జయంతి వేడుకలు



అమరావతి, మార్చి 7: ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం అవనిగడ్డ వంతెన సెంటరులో కృష్ణారావు విగ్రహానికి అవనిగడ్డ దస్తావేజు లేఖరులు బచ్చు నరసింహారావు, గాజుల పాండు రంగారావు, కోటేశ్వరరావు, తండు రమేష్ బాబు, దాసినేని నరేంద్ర, మిరియాల సురేష్ కృష్ణ, దాసినేని నాగ మల్లేశ్వరరావు, మిరియాల కిరణ్ బాబు, రేపల్లె రామకృష్ణ, జంపని కిషోర్, పెదపల్లి భరత్ ప్రసాద్, పోతేపల్లి శ్రీనివాసరావు, టంటం నాగేశ్వరరావు నివాళులర్పించారు.

మండలి వెంకట కృష్ణారావు శత జయంతి కమిటీ, గాంధీ క్షేత్రం కమిటీల ప్రతినిధులు, మండలి అభిమానుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, జనసేన ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ్ ప్రసాద్, నీటి సంఘాల అధ్యక్షులు రేపల్లె రవీంద్ర, చుండూరు నాగేశ్వరరావు, ప్రముఖ న్యాయవాది బొప్పన వెంకట సుబ్రహ్మణ్యేశ్వరరావు, దివిసీమ లలిత కళా సమితి ప్రధాన కార్యదర్శి కూనపరెడ్డి చంద్రశేఖర్, పీఏసీఎస్ చైర్మన్లు యలవర్తి చిన్నా, మాదివాడ రత్నారావు, యర్రంశెట్టి సుబ్బారావు, గాంధీ క్షేత్రం ప్రధాన కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మానేపల్లి కోటయ్య, గాంధేయవాది గరికపాటి సీతారామయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, టీడీపీ టౌన్ అధ్యక్షులు అన్నపరెడ్డి లక్ష్మీనారాయణ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మాచవరపు ఆదినారాయణ, మాజీ ఎంపీపీ బండే కనకదుర్గ, ఆసుపత్రి డైరెక్టర్ బచ్చు కృష్ణకుమారి, కూటమి నాయకులు బండే రాఘవ, కూరాకుల శివప్రసాద్, బచ్చు శ్రీహరి, డేగల రాఘవ, పులిగడ్డ బాలు శ్రీనివాస్, ఆకుల సీతామహాలక్ష్మి, డైరెక్టర్ అన్నపరెడ్డి వెంకటేశ్వరమ్మ, వార్డ్ సభ్యులు అడపా వెంకటేశ్వరరావు, నాయకులు మండలి రామ్మోహనరావు, లుక్కా వెంకట పిచ్చియ్య, చెన్ను గాంధీ, చెన్ను బాబూరావు, లుక్కా శ్రీనివాసరావు, భోగాది బాలకృష్ణ, బడే సుబ్బారావు, గుగ్గిలం శ్యాంకుమార్, షేక్ మొగల్ మురాద్ బేగ్, బాబావలీ, బషీర్, సోమిరెడ్డి, సిద్ధాబత్తుని హరినాథబాబు, బడే సుబ్బారావు, యాసం శ్రీరాములు, మైలా హరిబాబు, కొండవీటి పాండురంగారావు, గుడివాక నరహరి, బచ్చు ఆదినారాయణ, గుడివాక రాము, వాహేదుల్లా, బాలమ్మ, పాల్గొన్నారు.

# పల్లె సింధూర రెడ్డికి ఛాంపియన్‌షిప్..

-ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్రీడా పోటీల్లో సత్తా చాటిన పుట్టపర్తి ఎమ్మెల్యే

-8 మెడల్స్, విన్నర్స్ కప్పుతో ప్రతిభకు గుర్తింపు



అమరావతి, మార్చి 7:ఆంధ్రప్రదేశ్ శాసన వ్యవస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్రీడా సాంస్కృతిక పోటీల్లో పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అద్భుత ప్రతిభ కనబరిచి ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. పలు క్రీడా విభాగాల్లో పాల్గొని మొత్తం 8 మెడల్స్‌తో పాటు విన్నర్స్ కప్పును అందుకొని తన క్రీడా నైపుణ్యాన్ని చాటుకున్నారు. ఫిబ్రవరి 24, 25, 26 తేదీల్లో విజయవాడలోని మున్సిపల్ ఇందిరా గాంధీ స్టేడియంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం ప్రత్యేకంగా ఈ క్రీడా పోటీలు నిర్వహించారు. శాసనసభ్యుల మధ్య స్నేహభావాన్ని పెంపొందించడంతో పాటు ఆరోగ్యకరమైన పోటీ వాతావరణాన్ని సృష్టించేందుకు ఈ క్రీడా ఉత్సవాలను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాల నుంచి వచ్చిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.

ఈ పోటీల్లో భాగంగా టగ్ ఆఫ్ వార్, జావెలిన్ త్రో, షాట్ పుట్, టెన్నిస్, మ్యూజికల్ చైర్, టికిల్ బాల్, టెన్నికాయిట్, షటిల్ బ్యాడ్మింటన్ వంటి పలు క్రీడల్లో పల్లె సింధూర రెడ్డి పాల్గొన్నారు. టగ్ ఆఫ్ వార్ పోటీలో విజేతగా నిలవగా, టెన్నికాయిట్‌లో కూడా అద్భుత ప్రదర్శన కనబరిచి విన్నర్‌గా నిలిచారు. అలాగే షటిల్ బ్యాడ్మింటన్, మ్యూజికల్ చైర్, టికిల్ బాల్ వంటి విభాగాల్లో రన్నర్‌గా నిలిచి మొత్తం ఎనిమిది మెడల్స్ సాధించారు. ఆమె చూపిన క్రీడా స్ఫూర్తి, పోటీ ధోరణి అందరినీ ఆకట్టుకుంది.

క్రీడా పోటీలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఘనంగా నిర్వహించారు. విజయవాడలోని అంతర్లక్స్ కన్వెన్షన్ హాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన "ఆట విడుపు?2026" కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ ప్రతిభను సాంస్కృతిక రంగంలోనూ ప్రదర్శించారు.

కొందరు సినీ పాటలు పాడగా, మరికొందరు మిమిక్రీ, నాటికలు ప్రదర్శించి సభలో నవ్వులు పూయించారు. ఈ కార్యక్రమం అందరినీ ఉత్సాహపరిచింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణం రాజు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్తో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన పల్లె సింధూర రెడ్డికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేతుల మీదుగా రెండు విన్నర్స్ కప్పులు, ఎనిమిది మెడల్స్ అందజేశారు.

క్రీడల్లో అద్భుత ప్రదర్శన కనబరిచినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా అభినందించారు. అలాగే స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణం రాజు, మంత్రులు పయ్యావుల కేశవ్, సవిత, అనిత, సంధ్యారాణి తదితరులు ఆమెను ప్రశంసించారు. మహిళా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా పల్లె సింధూర రెడ్డిని "క్రీడల రాణి"గా అభివర్ణిస్తూ ప్రత్యేకంగా అభినందించారు. శాసన బాధ్యతలతో పాటు క్రీడల్లోనూ తన ప్రతిభను చాటుకోవడం ద్వారా పల్లె సింధూర రెడ్డి అందరికీ ఆదర్శంగా నిలిచారని పలువురు అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల మధ్య నిర్వహించిన ఈ క్రీడా పోటీలు స్నేహభావాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషించాయని నిర్వాహకులు తెలిపారు.

# ఉట్నూరుకు చేరుకున్న రథయాత్ర

ఆదిలాబాద్, మార్చి 7: భారత రాజ్యాంగాన్ని పాఠ్య పుస్తకాలు చేర్చాలని డిమాండ్ చేస్తూ జై భీమ్ మహాసేన, విశ్వ జన కళామండలి విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తెలంగాణలో మార్చి 1న ప్రారంభమైన రథయాత్ర శనివారం అదిలాబాద్ జిల్లా ఉట్నూరు ఎక్స్ రోడ్డుకు చేరుకుంది. ఉట్నూర్ ఎక్స్ రోడ్ లో జరిగిన కార్యక్రమంలో జై భీమ్ మహాసేన వ్యవస్థాపక అధ్యక్షులు రాజ్యాంగం అంజన్న, విశ్వజన కళామండలి వ్యవస్థాపక అధ్యక్షులు మాస్టర్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగాన్ని పాఠ్యపుస్తకాలు చేర్చాలని డిమాండ్ చేస్తూ 33 జిల్లాల్లో రథయాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారత రాజ్యాంగాన్ని అన్ని పాఠ్యపుస్తకాలు చేర్చేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అన్ని జిల్లాలు రథయాత్ర అనంతరం పాఠ్యపుస్తకాల్లో రాజ్యాంగాన్ని చేర్చాలని ఏప్రిల్ నెలలో రిలే దీక్షలు నిరవధిక నిరాహార దీక్షలు చేపడతామని ఏప్రిల్ 14న అమరణ నిరాహార దీక్ష చేపడతామని వారన్నారు అనంతరం నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# మెగా వైద్య శిబిరాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్

ఆదిలాబాద్, మార్చి 7: అదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని షాంపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ప్రత్యేక మెగా మెడికల్ క్యాంపు శిబిరాన్ని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా సందర్శించి పరిశీలించారు. వైద్య శిబిరంలో వైద్య అధికారులు చేస్తున్న వైద్య పరీక్షలను పరిశీలించి వైద్యాధికారులతో మాట్లాడారు.

శిబిరానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ వైద్యాధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్, ఏజెన్సీ అదనపు వైద్య అధికారి కుడిమెత మనోహర్, ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ ఉపేందర్ జాదవ్, షాంపూర్ వైద్యాధికారి రాథోడ్ సందీప్, రిమ్స్ ఆస్పత్రి వైద్య అధికారులు, స్థానిక వైద్య ఉద్యోగులు, ఆశా వర్కర్లు, రోగులు, ప్రజలు పాల్గొన్నారు.

# తిరువనంతపురంలో అధునాతన పట్టణ పారిశుద్ధ్యానికి ఊతమిస్తున్న ఏఐ రోబోట్

న్యూఢిల్లీ, మార్చి 7:స్వచ్ఛ భారత్ మిషన్-అర్బన్ 2.0 కింద అధిక ప్రమాదం ఉన్న ప్రాంతాలలోని కాలువలను సురక్షితంగా, ఖచ్చితంగా, మానవ ప్రమేయం లేకుండా శుభ్రం చేయడం కోసం ఏఐ ఆధారిత జీ-స్పైడర్ రోబోట్‌ను తిరువనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ వినియోగంలోకి తీసుకొచ్చింది.

మనుషుల ద్వారా వ్యర్థాలను తొలగించే పద్ధతిని పూర్తిగా నిర్మూలించడానికి, ప్రమాదకరమైన, చేరుకోలేని ప్రాంతాలలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికుల భద్రతను నిర్ధారించడానికి తిరువనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ ఒక కీలక ముందడుగు వేసింది. ఇందులో భాగంగా తంపానూర్ రైల్వే స్టేషన్ సమీపంలోని అమాయిజాంచన్ కాలువ వద్ద కృత్రిమ మేధతో పనిచేసే 'జీ స్పైడర్' అనే రోబోటిక్ వ్యవస్థను ప్రవేశపెట్టింది.

అమాయిజాంచన్ కాలువ ముఖ్యంగా తంపానూర్ రైల్వే స్టేషన్ కింద ఉన్న మూసివేసిన భాగం. శుభ్రం చేయడం చాలా సవాలుతో కూడుకున్న పని. ఎత్తు తక్కువగా ఉండటం, నిరంతర నీటి ప్రవాహం, ఇరుకైన పని పరిస్థితులు మనుషులు సురక్షితంగా లోపలికి వెళ్లే మార్గాలు లేకపోవడం వల్ల సాధారణ పద్ధతుల్లో దీనిని తరుచూ శుభ్రం చేయడం, నిర్వహించడం అత్యంత కష్టతరంగా మారింది.

ఈ అడ్డంకులను అధిగమించడానికి స్థానిక స్వపరిపాలన శాఖ మంత్రి శ్రీ ఎంబీ రాజేష్ కృత్రిమ మేధతో పనిచేసే ఈ రోబోటిక్ కెనాల్ క్లీనింగ్ వ్యవస్థను ప్రారంభించారు. ఈ కార్యక్రమం తిరువనంతపురం మున్సిపల్ కార్పొరేషన్, టెక్నోపార్క్‌కు చెందిన జెన్‌రోబోటిక్ ఇన్నోవేషన్స్ (ప్రసిద్ధ 'బాండికూట్' రోబోల తయారీదారులు) మధ్య కుదిరిన ఉమ్మడి భాగస్వామ్యాన్ని సూచి స్తుంది.

ఈ అధునాతన రోబోటిక్ వ్యవస్థ ప్రవేశపెట్టడం వల్ల కార్మికులు ప్రమాదకరమైన, అపరిశుభ్రమైన వాతావరణంలోకి వెళ్లాల్సిన అవసరం పూర్తిగా తప్పుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం వ్యర్థాల నిర్వహణలో పని సామర్థ్యాన్ని పెంచడమే కాకుండా, భద్రతా ప్రమాణాలను గణనీయంగా బలోపేతం చేసే ఒక విప్లవాత్మక చర్యగా వారు పేర్కొన్నారు.

జెన్‌రోబోటిక్ ఇన్నోవేషన్స్ రూపొందించిన జీ స్పైడర్, కాలువను శుభ్రపరిచే స్వయంచాలక రోబో. దీనిని సంక్లిష్టమైన, ప్రమాదకర కాలువ పరిసరాల్లో మనుషులు వెళ్లి పని చేయలేని చోట శుభ్రపరిచేందుకు రూపొందించారు. కేబుల్ డ్రైవెన్ ప్యారలల్ రోబోటిక్స్ ఆర్కిటెక్చర్‌పై రూపొందించారు. కృత్రిమ మేధ ఆధారిత విజన్, సెన్సార్ ఇంటెలిజెన్స్ ద్వారా శక్తిని పొందుతుంది. ఇది పేరుకుపోయిన వ్యర్థాలను ఖచ్చితంగా గుర్తించి, అంచనా వేసి, తొలగించడానికి వీలు కల్పిస్తుంది.

అధునాతన యంత్ర సాంకేతికతను ఉపయోగించి ఈ వ్యవస్థ వ్యర్థాల రకాలను, నీటి ప్రవాహ పరిస్థితులను నిర్మాణపరమైన సవాళ్లను స్వయంప్రతిపత్తంగా గుర్తించి, తదనుగుణంగా తక్షణమే మారుతుంది. ఐదు-డిగ్రీ ల-స్వేచ్ఛ కలిగిన దీని రోబోటిక్ యంత్రాంగం, జీవక్రియలను పోలి ఉండే బయోమిమెటిక్ క్లా-టైప్ గ్రాబర్‌తో అమర్చబడి ఉంటుంది. ఇది మిశ్రమ అసమాన వ్యర్థాలను ఖచ్చితమైన స్థానంలో పట్టుకోవడానికి సురక్షితంగా తరలించడానికి సహాయ పడుతుంది. సేకరించిన వ్యర్థాలను నేరుగా నిర్దేశించిన వాహనాల్లోకి మళ్లిస్తుంది. దీనివల్ల వ్యర్థాల గుర్తింపు నుంచి సురక్షితమైన విసర్జన వరకు మొత్తం ప్రక్రియ మానవ ప్రమేయం లేకుండా పూర్తవుతుంది.

తిరువనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ అమల్లోకి తీసుకొచ్చిన జీ స్పైడర్ ఏఐ ఆధారిత రోబోటిక్ వ్యవస్థ.. పట్టణ పారిశుద్ధ్య రంగంలో ఒక విప్లవాత్మక మార్పును సూచిస్తుంది. కాలువల శుభ్రతను ఆటోమేషన్ చేయడం ద్వారా ఈ రోబో పారిశుద్ధ్య కార్మికులకు విష వాయువులు, కలుషిత నీరు, ప్రమాదకర వ్యర్థాలతో నేరుగా సంబంధం లేకుండా చేసి, వారి భద్రతను గణనీయంగా పెంచుతుంది. నీటి మట్టం ఎక్కువగా ఉన్నప్పుడు నిరంతర ప్రవాహం ఉన్న పరిస్థితుల్లో కూడా సమర్థవంతంగా పనిచేసేలా రూపొందించిన జీ స్పైడర్.. పట్టణ నీటి మార్గాల నిర్వహణ ఎటువంటి అంతరాయం లేకుండా నిరంతరం కొనసాగేలా చూస్తుంది. ఇది ప్లాస్టిక్, పదునైన వస్తువులు, ఇతర హానికరమైన పదార్థాలతో కూడిన మిశ్రమ, ప్రమాదకర వ్యర్థాలను సురక్షితంగా బయటకు తీయగలదు. తద్వారా పారిశుద్ధ్య ప్రమాణాలను మెరుగుపరుస్తుంది. క్రమబద్ధ మైన, వ్యవస్థీకృత శుభ్రత ద్వారా ఈ రోబో డ్రైనేజీ సామర్థ్యాన్ని బలోపేతం చేస్తుంది. ఇది పట్టణ వరదలను నివారించడంలో, నగరాన్ని శుభ్రంగా, సురక్షితంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

జీ స్పైడర్ ఆటోమేటెడ్ కెనాల్ క్లీనింగ్ రోబోట్ విస్తరణ సురక్షితమైన, యంత్రీకమైన, సాంకేతికతతో కూడిన కాలువల నిర్వహణ దిశగా ఒక నిర్ణయాత్మక మార్పును సూచిస్తుంది. కార్మికులు ప్రమాదకరమైన వాతావరణంలోకి వెళ్లాల్సిన అవసరం లేకుండా చేయడం ద్వారా ఈ కార్యక్రమం పారిశుద్ధ్య కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పిస్తుంది. పని సామర్థ్యాన్ని పెంచుతుంది. స్థిరమైన పట్టణ మౌలిక సదుపాయాల వ్యవస్థలను బలోపేతం చేస్తుంది. విస్తరించదగిన, అనుసరణీయమైన నమూనాగా నిలుస్తూ, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇతర అధిక ముప్పు కలిగిన కాలువలు, డ్రైనేజీ వ్యవస్థలో సాంకేతికతను అమలు చేయడానికి ఈ జీ స్పైడర్ ఒక బలమైన ఉదాహరణగా నిలుస్తుంది.స్వచ్ఛ భారత్ మిషన్ లక్ష్యాలకు అనుగుణంగా ఇటువంటి సాంకేతిక ఆధారిత చర్యలు పట్టణ పారిశుద్ధ్య వ్యవస్థలను ఆధునీకరించడానికి రాష్ట్రాలు కొత్త ఆవిష్కరణలను ఏ విధంగా స్వీకరిస్తాయో ప్రతిబింబిస్తాయి. అదే సమయంలో పారిశుద్ధ్య కార్మికుల గౌరవం, భద్రత, శ్రేయస్సుకు ఇవి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నాయి.

# మహిళా సాధికారతకు పెద్దపీట వేద్దాం..

-చిన్నతనం నుండే బాలికలను యోగ సాధన వైపు ప్రోత్సహిద్దాం

-కర్నూలు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ శమంతకమణి



కర్నూలు, మార్చి 7: మహిళా సాధికారతకు పెద్దపీట వేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కర్నూలు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ శమంతకమణి అన్నారు. శనివారం కర్నూలు అవుట్డోర్ స్టేడియం నందు మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా యోగా సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి ఉమెన్స్ యోగ ప్రీమియర్ లీగ్ పోటీలను జిల్లా యోగా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్.ముంతాజ్ బేగం, జిల్లా క్రీడాల అభివృద్ధి అధికారి భూపతిరావు, జిల్లా సంఘం ఉపాధ్యక్షుడు శ్రీనివాసలు, న్యూట్రిషన్ సునీత తో కలిసి ఆమె ప్రారంభించారు.

ఈ సందర్భంగా కర్నూలు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ శమంతకమణి మాట్లాడుతూ చిన్నతనం నుండే బాలికలను యోగ సాధన వైపు ప్రోత్సహిస్తే ఒత్తిడిని అధిగమించి తాము అనుకున్న రంగంలో రాణించి దేశానికి సేవ చేస్తారన్నారు. అనంతరం ముంతాజ్ బేగం, భూపతిరావులు మాట్లాడుతూ? కర్నూలు జిల్లా నుంచి అనేకమంది బాలికలు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చారని అన్నారు. చిన్నారులు క్రమశిక్షణతో సాధన చేస్తే ఏదైనా సాధించవచ్చు అని యోగా క్రీడాకారులు చేసి చూపారని అన్నారు.

బాలికలతో పాటు మహిళలను ప్రోత్సహించేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని తెలిపారు. అనంతరం యోగా రంగంలో విశిష్ట సేవలు అందించిన మహిళ శిక్షకులను ఘనంగా సత్కరించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా సుమారు 170 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘం అధ్యక్ష కార్యదర్శులు అవినాష్ శెట్టి, ముని స్వామి, ఉమ్మడి జిల్లాల యోగ సంఘం సభ్యులు గంగాధర్, లాలన ప్రియం, నివేదిత, అక్బర్, శిక్షావలి, విజేత వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# శ్రీ శివ విఘ్నేశ్వర ధ్వజస్తంభ మహోత్సవ పూజలు..

వరంగల్ మార్చి 7: గ్రేటర్ వరంగల్ శివనగర్ 35వ డివిజన్ శ్రీ శివ విఘ్నేశ్వర దత్త సాయి దేవాలయం ధ్వజస్తంభ పునః ప్రతిష్ట మహోత్సవ పూజలు ప్రారంభమయ్యాయి. ఉదయం ఆవాహిత మంటపారాధన, ధనాధివాసం, దాన్యాది వాసం, ఫలాదివాసం, పుష్పాదివాసం, పూజాది కార్యక్రమాలు వేద బ్రాహ్మణులుచే నిర్వహించారు. భారీగా భక్తులు హాజరై ధ్వజస్తంభంకు విశేష పూజలు నిర్వహించారు.

ఈనెల 8న ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్టాప మహోత్సవం, అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆలయ అధ్యక్షుడు కొండి రాజమౌళి తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చింతం యాదగిరి, కోశాధికారి రాంపల్లి ఉపేందర్, కార్యదర్శి కొయ్యాడ శ్రీధర్, పూజారి జూలపల్లి విశ్వేశ్వర్, కుడి కాల సురేందర్, మాచర్ల నరేందర్, డాక్టర్ చారి, డివిజన్ ప్రజలు భక్తులు భారీగా పాల్గొన్నారు.

# 'నేర్మటలో డ్రైనేజీ కాల్వల నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలి'

- సిపిఎం చండూరు మండల కార్యదర్శి జెర్రిపోతుల ధనుంజయ

నల్గొండ, మార్చి 7:చండూరు మండల పరిధిలోని నేర్మట గ్రామంలో మురుగు కాల్వల నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని సిపిఎం మండల కార్యదర్శి జెర్రిపోతుల ధనుంజయ కోరారు. శనివారం సిపిఎం ఆధ్వర్యంలో గ్రామంలో సమస్యలను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని 5వ వార్డు, 6వ వార్డు నుండి వచ్చే మురికి నీరు కాల్వల గుండా వచ్చి ఇండ్ల పక్కనే ఖాళీ స్థలంలోకి చేరడంతో ఆ వాసనకు ప్రజలు తట్టుకోలేక రోగాల బారిన పడుతున్నట్లు తెలిపారు. గ్రామంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల తరచుగా సమస్యలు ఎదురవుతున్నట్లు చెప్పారు. ఈ విషయంపై పదే పదే ప్రజా ప్రతినిధులకు, అధికారులకు చెప్పినప్పటికీ రేపు మాపు అని కాలం వెళ్లదీస్తున్నట్లు దుయ్యబట్టారు.

ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డ్రైనేజీ కాల్వల నిర్మాణం, మరమ్మతు పనులు వెంటనే ప్రారంభించాలని లేనియెడల సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి ఈరటి వెంకటయ్య, సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి బల్లెం స్వామి, బుర్కల రాజ్ కుమార్, కట్ట రామలింగయ్య, శేఖర్, వెంకన్న, యాదయ్య, కలిమెర భిక్షమయ్య, చెనగోని నరసింహ, సోనగోని నరసింహ, గుయ్యని జంగయ్య, భిక్షం, సాయమ్మ, కర్నాటి సైదమ్మ, కర్నాటి ముత్తమ్మ, బొడ్డుపల్లి భిక్ష మయ్య, కట్ట జానమ్మ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

# మహిళా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ




మచిలీపట్నం, మార్చి 7: అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాల సందర్భంగా కృష్ణా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం మచిలీపట్నం నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మచిలీపట్నం మహిళా పోలీస్ స్టేషన్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ నగరంలోని ప్రధాన వీధుల గుండా కొనసాగింది.

మహిళల భద్రత, సమాన హక్కులు, మహిళలపై జరిగే అఘాయిత్యాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ ర్యాలీ నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. మహిళల గౌరవం, రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా పోలీస్ అధికారులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సీఐలు, ఎస్సైలు, మహిళా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు కూడా ర్యాలీలో పాల్గొని మహిళా సాధికారతపై నినాదాలు చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు. ర్యాలీ అనంతరం మహిళల భద్రతకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు పోలీసులు సూచనలు అందించారు.

# ఖిలా వరంగల్‌లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



వరంగల్, మార్చి 7: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 38వ డివిజన్ అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డివిజన్ కార్పొరేటర్ బైరబోయిన ఉమా, మాజీ కార్పొరేటర్ భైరవైన దామోదర్ యాదవ్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా డివిజన్ పరిధిలో సేవలందిస్తున్న ఆర్‌పీలు, మహిళా సంఘాల ప్రతినిధులు, ఆశా , అంగన్వాడీ కార్యకర్తలు, ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న మహిళా డాక్టర్లను సన్మానించారు. మహిళలు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సేవలు అమూల్యమని ప్రశంసించారు.

అనంతరం మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ముస్లిం మహిళల స్వయం ఉపాధి కోసం అందించిన ఏడు కుట్టు మిషన్లను కార్పొరేటర్ అందజేశారు. మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా మరింత బలపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్పీలు బండి శోభ, పోశాల అరుణ, ఇనుములసుజాత, మిట్టపెల్లి కృష్ణవేణి, నలిగంటి రాధిక, శ్రీలత తదితరులు పాల్గొన్నారు .

# సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో గొప్పది : ఎంఈఓ అంజయ్య

నల్గొండ, మార్చి 7:విద్యా రంగంలో మహిళా ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గదర్శకులుగా నిలుస్తున్నారని కట్టంగూర్ మండల విద్యాధికారి అంబటి అంజయ్య అన్నారు. శనివారం కట్టంగూర్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో గొప్పదని, వారు దేశానికి, సమాజానికి అందిస్తున్న సేవలు అపారమని కొనియాడారు. మహిళల సేవలను గుర్తించి వారిని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. మహిళలు అన్నిరంగాల్లో ముందుకు సాగేందుకు ప్రోత్సహించాలని పేర్కొన్నారు. అనంతరం మహిళ ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించారు.

మహిళ దినోత్సవ ప్రాముఖ్యతపై ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాణి, తేజస్విని, జయమ్మ, కనకదుర్గ, శ్రీదేవి, షాహిదా, నీరజ, యాదమ్మ, శైలజ పాల్గొన్నారు.

# ఒడిశాలోని ముండలిలో సీఐఎస్ఎఫ్ 57వ ఆవిర్భావ దినోత్సవంలో

## ప్రసంగించిన కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా

న్యూఢిల్లీ, మార్చి 7:ఒడిశాలోని ముండలిలో ఈ రోజు నిర్వహించిన కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) 57వ ఆవిర్భావ దినోత్సవానికి కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి శ్రీ అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రూ. 890 కోట్ల వ్యయంతో నిర్మించనున్న మూడు సీఐఎస్ఎఫ్ నివాస సముదాయాలకు (కామరూప్, నాసిక్, సీహోర్) ఈ సందర్భంగా ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే రాజర్హాత్, ఢిల్లీలలో నిర్మించిన రెండు నివాస సముదాయాలను ప్రారంభించారు. కేంద్ర మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్, ఒడిశా ముఖ్యమంత్రి శ్రీ మోహన్ చరణ్ మాఝీ, కేంద్ర హోం శాఖ కార్యదర్శి, సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్, పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు 56 ఏళ్లు పూర్తి చేసుకున్న సీఐఎస్ఎఫ్ పారిశ్రామిక భద్రత రంగంలో శూన్యం నుంచి శిఖరాగ్ర స్థాయికి చేరుకుందనీ.. భద్రతా దళం దీక్షాదక్షతలకూ, పరాక్రమానికీ ఇది నిదర్శనమనీ కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి శ్రీ అమిత్ షా తన ప్రసంగంలో కొనియాడారు. దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేయాలన్నా, ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారత్‌ను నిలపాలన్నా.. పారిశ్రామికాభివృద్ధి అత్యావశ్యకమని ఆయన పేర్కొన్నారు. అలాగే పారిశ్రామిక వికాసం కోసం ఒక సురక్షిత వాతావరణాన్ని నెలకొల్పడంలో జాతీయ స్థాయి పారిశ్రామిక భద్రతా దళం పాత్ర అత్యంత కీలకమని స్పష్టం చేశారు. నెలకొల్పిన లక్ష్యాలను నెరవేర్చడమే కాకుండా.. ప్రతి సవాలు నుంచీ పాఠాలు నేర్చుకుంటూ, గత 56 ఏళ్లుగా సీఐఎస్ఎఫ్ నిరంతరం కాలానుగుణంగా పరిణామం చెందుతూ వచ్చిందని శ్రీ అమిత్ షా అన్నారు. సంప్రదాయాలను కాపాడుకుంటూనే ఆధునికతనూ సీఐఎస్ఎఫ్ అందిపుచ్చుకున్నదని ప్రశంసించారు. భారత చరిత్రలోని విశిష్ట సంప్రదాయాలకు ధైర్యాన్నీ, త్యాగాన్నీ, అంకితభావాన్నీ మేళవించి- అత్యాధునిక ఆయుధాలతో సన్నద్ధమవ్వడం ద్వారా.. ఎలాంటి సవాలునైనా ఎదుర్కొని నిలవగల దృఢ సంకల్పాన్ని సీఐఎస్ఎఫ్ చాటుకున్నదని హోం మంత్రి కొనియాడారు.

కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం లేకుండా దేశ పారిశ్రామిక వికాస లక్ష్యాన్ని సాకారం చేసుకోలేమని శ్రీ అమిత్ షా అన్నారు. సీఐఎస్ఎఫ్ ఎల్లవేళలా దేశానికి ఒక రక్షణ కవచంగా దృఢంగా నిలుస్తుందన్నారు. దేశంలోని అన్ని ఓడరేవుల భద్రతను సీఐఎస్ఎఫ్‌కు అప్పగించాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఇటీవల నిర్ణయించిందని ఆయన వెల్లడించారు. రెండు ముఖ్యమైన లక్ష్యాలను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దేశ ప్రజల ఎదుట నిలిపారని ఆయన గుర్తుచేశారు. మొదటిది 2047 నాటికి సంపూర్ణంగా అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను నిలపడంతోపాటు ప్రతి రంగంలోనూ ప్రపంచంలో అగ్రస్థానానికి ఎదగడం. రెండోది 2027 నాటికి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను తీర్చిదిద్దడం. ఈ లక్ష్యాల సాధన దిశగా ఉత్ప్రేరకం వంటి పాత్రను సీఐఎస్ఎఫ్ పోషిస్తోందని శ్రీ అమిత్ షా చెప్పారు.

దేశాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడంలో సీఐఎస్ఎఫ్ సిబ్బంది త్యాగాలు ఎల్లవేళలా కీలక పాత్ర పోషించాయని కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా కొనియాడారు. విధి నిర్వహణలో సీఐఎస్ఎఫ్ ఎప్పుడూ వెనకడుగు వేయలేదన్నారు. ఈ దళం సాధించిన 9 రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 2 అత్యుత్తమ బెటాలియన్ ట్రోఫీలు, అంతర్జాతీయ స్థాయిల్లో క్రీడాకారులు సాధించిన పతకాలు... ప్రతి రంగంలోనూ అత్యున్నత ప్రదర్శన కనబరిచేందుకు సీఐఎస్ఎఫ్ ఎప్పుడూ సన్నద్ధంగా ఉంటుందనడానికి ఇవి నిదర్శనాలని ఆయన పేర్కొన్నారు. గత 56 ఏళ్లలో మొత్తం 13,693 పతకాలను అందుకొని.. శౌర్య పరాక్రమాలనూ, సమర్థతనూ సీఐఎస్ఎఫ్ చాటుకున్నదని శ్రీ అమిత్ షా అభినందించారు.

రూ. 890 కోట్ల విలువైన 5 విభిన్న ప్రాజెక్టులకు నేడిక్కడ శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసినట్టు శ్రీ అమిత్ షా చెప్పారు. రాజర్హాత్, మైదాన్‌గర్హిల్లో నివాస సముదాయాల నిర్మాణం పూర్తయిందనీ, ఇవి మన జవాన్లకూ వారి కుటుంబాలకూ మెరుగైన వసతులను కల్పిస్తాయనీ ఆయన పేర్కొన్నారు. అలాగే సీఐఎస్ఎఫ్ వార్షిక పత్రిక 'సెంటినెల్'ను ఈ సందర్భంగా విడుదల చేసినట్టు ఆయన వెల్లడించారు.

నేడు దేశవ్యాప్తంగా 70 విమానాశ్రయాలతోపాటు 361 అతి ముఖ్యమైన సంస్థలకు సీఐఎస్ఎఫ్ రక్షణ కల్పిస్తోందని కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి తెలిపారు. అలాగే డ్రోన్ భద్రతకు సంబంధించి కూడా నోడల్ ఏజెన్సీ బాధ్యతను సీఐఎస్ఎఫ్‌కు అప్పగించినట్టు ఆయన పేర్కొన్నారు. గత ఏడాది కాలంలో కర్తవ్య భవన్, సేవాతీర్థ్, నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయం, నవీ ముంబయి విమానాశ్రయం, లెంగ్‌పుయ్ విమానాశ్రయం, జవహర్‌పూర్ థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు, భాక్రా డ్యామ్ ప్రాజెక్టు వంటి అనేక కీలక ప్రాజెక్టుల భద్రత బాధ్యతలను సీఐఎస్ఎఫ్‌కు అప్పగించినట్టు ఆయన వెల్లడించారు. ఓడరేవుల భద్రత బాధ్యత లను స్వీకరించిన అనంతరం.. దేశ సుదీర్ఘ సముద్ర తీర ప్రాంతంలోని రేవులకు కూడా సీఐఎస్ఎఫ్ రక్షణ కల్పిస్తుందని శ్రీ అమిత్ షా చెప్పారు. హైబ్రిడ్ విధానంలో ఓ నమూనాను రూపొందించి.. ప్రైవేటు పారిశ్రామిక సమూహాలకు కూడా భద్రతను అందించాలని నాలుగేళ్ల కిందటే తాము కోరామనీ, ఇప్పుడు అత్యాధునిక పరికరాలతో ఆ దిశగా సన్నద్ధంగా ఉన్నామనీ వెల్లడించారు. ముస్ముందు ప్రైవేటు పారిశ్రామిక సంస్థలకు కూడా హైబ్రిడ్ విధానంలో భద్రతా సేవలను సీఐఎస్ఎఫ్ అందిస్తుందని శ్రీ అమిత్ షా తెలిపారు.

2026 మార్చి 31 నాటికి దేశాన్ని నక్సలిజం నుంచి విముక్తం చేయాలన్నది మోదీ ప్రభుత్వ దృఢ సంకల్పమని కేంద్ర హోం మంత్రి పేర్కొన్నారు. ఈ లక్ష్య సాధనలో సీఐఎస్ఎఫ్ అందించిన సేవలు ఎంతో విశిష్టమైనవని కొనియాడారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల్లో నక్సల్ వ్యతిరేక కార్యకలాపాలలో సీఐఎస్ఎఫ్ తన వంతు పాత్రను సమర్థంగా పోషించిందన్నారు. మార్చి 31 నాటికి దేశం నక్సలిజం నుంచి పూర్తి స్థాయిలో విముక్తి పొందుతుందన్నారు. మన భద్రతా దళాలు పూర్తి స్థాయిలో ఆధిపత్యం సాధిస్తాయనీ, తిరుపతి నుంచి పశుపతినాథ్ వరకు రెడ్ కారిడార్ నిర్మించాలని కలలు గన్న శక్తులు పూర్తిగా ఓడిపోబోతున్నాయనీ హోం మంత్రి స్పష్టం చేశారు. ఇది ప్రధానమంత్రి శ్రీ మోదీ నాయకత్వంలో మన భద్రతా దళాలు సాధించిన అతిపెద్ద విజయమని శ్రీ అమిత్ షా వ్యాఖ్యానించారు. నేడు మనం దేశాన్ని నక్సలిజం నుంచి విముక్తం చేసే దశకు చేరుకున్నామన్నారు. దేశం మొత్తాన్నీ అభివృద్ధి పథంలో నడిపించి, 2047 నాటికి 'వికసిత భారత్'ను సాకారం చేయడమే ప్రధాన మంత్రి శ్రీ మోదీ లక్ష్యమనీ, ఈ లక్ష్యం సాకారం కావాలంటే అంతర్గత, బహిర్గత భద్రతను కాపాడుకోవడం అత్యంత ఆవశ్యకమని స్పష్టం చేశారు. దేశ అంతర్గత, బహిర్గత భద్రతను పటిష్టం చేసుకోవడం లక్ష్యంగా.. సరిహద్దులతోపాటు దేశం లోపలా సమర్థంగా తన వంతు పాత్ర పోషించేందుకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని హోం మంత్రి స్పష్టం చేశారు.

# వీకే కోల్ మైన్ సమస్యలపై సింగరేణి సీఎండీకి వినతి

ఖమ్మం, మార్చి 7: సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని వీకే కోల్ మైన్‌లో శనివారం బొగ్గు రవాణాను ప్రారంభించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని వీకే కోల్ మైన్‌కు సంబంధించిన సమస్యలపై వి.కే.సి.ఎం యూనియన్ ప్రతినిధులు, ఉద్యోగులు ఆయనకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సింగరేణి యాజమాన్యం మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశాలు నిర్వహించి కొన్ని విభాగాల్లో ఉద్యోగులు అధికంగా ఉన్నారని పేర్కొంటున్నారని తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లో బొగ్గు తవ్వకాలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించకుండా, సింగరేణి ఉద్యోగులతోనే బొగ్గు తీయించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రంలో ప్రధానంగా వారు ఐదు డిమాండ్లను ప్రస్తావించారు.

వీకే కోల్ మైన్‌లో ఉన్న బొగ్గును పూర్తిగా సింగరేణి ఉద్యోగులతోనే తవ్వించాలని, ప్రైవేట్ సంస్థలకు అప్పగించకూడదని కోరారు. అలాగే జీకే ఓసీ మూతపడిన నేపథ్యంలో డిప్యుటేషన్‌పై ఇతర ప్రాంతాలకు పంపిన వివిధ హోదాల ఉద్యోగులను మళ్లీ వీకే సీఎమ్ కోల్ మైన్‌కు తీసుకురావాలన్నారు. అదేవిధంగా వీకే కోల్ మైన్‌ను పూర్తిగా సింగరేణి కంపెనీ యంత్రాలతోనే నడపాలని కోరారు. ఇంకా పీవీకే-5 మైన్ కూడా త్వరలో మూతపడే అవకాశం ఉన్న నేపథ్యంలో అక్కడ పనిచేస్తున్న సుమారు 900 మంది ఉద్యోగుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు తీసుకోవాలని యాజమాన్యాన్ని కోరారు. వినతి పత్రాన్ని అందజేసిన వారిలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ముఖ్య ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ, ఏఐటీయూసీ ఫిట్ సెక్రటరీ ఎం.ఆర్.కే ప్రసాద్, ఐఎన్టీయూసీ ఫిట్ సెక్రటరీ గోపు కుమారస్వామి, ఐఎఫ్‌టీయూ ఫిట్ సెక్రటరీ కాపు కృష్ణ, విప్లవ రెడ్డి, కాగితపు విజయ్ కుమార్, హిరాలాల్ తదితర యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులు

### -డెస్క్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్ లు తగ్గిస్తారన్న అపోహ వద్దు

### -టి యు డబ్ల్యూ జే (ఐజేయు) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ




మహబూబ్‌నగర్, మార్చి 7:రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టుల అందరికీ అక్రిడేషన్లు అందజేయాలని టియుడబ్ల్యూ జే (ఐజెయూ)రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ అన్నారు. మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలోని సురవరం ప్రతాపరెడ్డి ప్రెస్ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, ఫోటో, వీడియో, డెస్క్ జర్నలిస్టు, ఉర్దూ మీడియా విభాగాల్లో వర్కింగ్ జర్నలిస్టుల అందరికీ అక్కిడిటేషన్ కార్డు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

జీవో 252లో లోపాలు ఉన్న కారణంగానే యూనియన్ తరపున ముందుగానే ప్రభుత్వం, సంబంధిత శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లామని ఇప్పటికే కొన్ని సవరణలు చేసినట్లు తెలిపారు. డెస్క్ జర్నలిస్టులకు అక్రిడేషన్ల కేటాయింపులో కోత పెడుతున్నారని అపోహాలు ఉండొద్దన్నారు. విషయాన్ని ఇప్పటికే ఐ అండ్ పి ఆర్ కమిషనర్ తో పాటు సంబంధిత శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇటీవల డెస్కు జర్నలిస్టులు చేపట్టిన నిరసన కార్యక్రమాలకు టీయూడబ్ల్యుజే తరఫున 100% మద్దతు ప్రకటించామన్నారు.

టియుడబ్ల్యూ జే గత ఆరున్నర దశాబ్దాలకు పైగా జర్నలిస్టుల పక్షపాతిగా వ్యవహరిస్తుందని, ఏ ప్రభుత్వానికి ఏ పార్టీకి కొమ్ముకాయదని విరాహత్ అలీ స్పష్టం చేశారు. మండల విలేకరులకు అక్రెడిటేషన్ కార్డు అందేలా కృషి చేసిన యూనియన్ టీయూబ్ల్యూజె అని గుర్తు చేశారు. రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్ మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో యూనియన్ బలోపేతానికి కృషి చేసిన ప్రతి సభ్యుడికి ధన్యవాదాలు తెలిపారు.

యూనియన్ విషయంలో రాష్ట్ర కార్యదర్శిగా తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని పేర్కొన్నారు. వర్కింగ్ జర్నలిస్టుల అందరికీ అక్రెడిటేషన్ విషయంలోనే కాదు, ఆరోగ్యం విషయంలోనూ తమ యూనియన్ నుంచి సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. అనంతరం మహబూబ్‌నగర్ ప్రెస్ క్లబ్ నుంచి డెస్క్ జర్నలిస్టుల నుంచి రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ కు వినతి పత్రాలు అందజేశారు.

జీవోలో సవరణలు చేయాలని వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులు అందేలా చూడాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్ణయ్య, యూనియన్ మహబూబ్నగర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కాటం నాగరాజుగౌడ్, ఎన్ సతీష్ కుమార్ రెడ్డి, ఉమ్మడి జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా కన్వీనర్ అహ్మద్ పాషా, జిల్లా కోశాధికారి జిల్లెల రఘు పాల్గొన్నారు.

# గ్రీన్ హైడ్రోజన్ ప్రమాణాలు, భద్రతా నియమావళిపై భారత్-యూకే సమావేశం..

న్యూఢిల్లీ, మార్చి 7:భారత ప్రభుత్వ జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌లో భాగంగా గ్రీన్ హైడ్రోజన్‌ను సురక్షితంగా వినియోగంలోకి తీసుకురావడంలో సహకారాన్ని బలోపేతం చేసేందుకు 27 ఫిబ్రవరి 2026న న్యూఢిల్లీలో "గ్రీన్ హైడ్రోజన్ ప్రమాణాలు, భద్రతా నియమావళి'' పై భారత్-యూకే సదస్సు జరిగింది. ఈ సమావేశంలో భారత్, బ్రిటన్ దేశాలకు చెందిన ప్రభుత్వాలు, పరిశ్రమలు, విద్యాసంస్థలు, ప్రమాణాల సంస్థలు, పరీక్షా కేంద్రాలు, పరిశోధనా సంస్థలు, నియంత్రణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

భారత్‌లోని బ్రిటిష్ హై కమిషన్, డబ్ల్యూఆర్ఐ ఇండియా సహకారంతో జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌కు మద్దతుగా నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ పరిధిలో స్థాపించిన జాతీయ హైడ్రోజన్ భద్రతా కేంద్రం (ఎన్‌సీహెచ్ఎస్) ఈ సమావేశాన్ని నిర్వహించింది. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, నిల్వ, రవాణా, వినియోగం వంటి మొత్తం వ్యవస్థలో పాటించాల్సిన నియంత్రణ విధానాలు, అంతర్జాతీయ ప్రమాణాలు, భద్రతా నియమావళిపై ఈ సదస్సులో కీలక చర్చలు జరిగాయి.

జాతీయ సౌరశక్తి సంస్థ డైరెక్టర్ జనరల్ మహ్మద్ రిహాన్ ప్రారంభ ఉపన్యాసంతో ఈ సదస్సు మొదలైంది. అనంతరం నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖకు చెందిన జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ డైరెక్టర్ అభయ్ బక్రే, భారత్‌లోని బ్రిటిష్ హై కమిషన్ తొలి కార్యదర్శి(వాణిజ్యం) జినూస్ షరియాతి, పెట్రోలియం, సహజ వాయువు నియంత్రణ మండలి కార్యదర్శి అంజన్ కుమార్ మిశ్రా, బ్రిటిష్ హై కమిషన్ తొలి కార్యదర్శి (వాతావరణం, శక్తి) లారా అయ్లెట్ ప్రత్యేక ప్రసంగాలు చేశారు.

భారత ప్రభుత్వ ప్రధాన శాస్త్రీయ సలహాదారు కార్యాలయం కార్యదర్శి పర్వీందర్ మైని ప్రసంగిస్తూ.. గ్రీన్ హైడ్రోజన్ సాంకేతికతలను పెద్ద ఎత్తున అమలు చేయడానికి బలమైన భద్రతా చర్యలు, ప్రమాణాల అభివృద్ధి, అంతర్జాతీయ సహకారం అవసరమని తెలిపారు.

హైడ్రోజన్ భద్రత, ప్రమాణాలకు బాధ్యత వహించే జాతీయ నియంత్రణ సంస్థల భాగస్వామ్యం ఈ సదస్సులో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. పెట్రోలియం, పేలుడు పదార్థాల భద్రతా సంస్థ (పీఈఎస్ఓ), హైడ్రోజన్ వ్యవస్థల భద్రతా నిబంధనల అమలు, ప్రమాద అంచనా, విపత్తు నిర్వహణపై నియంత్రణ దృక్పథాలను పంచుకుంది. భారతీయ ప్రమాణాల సంస్థ (బీఐఎస్), అభివృద్ధి చెందుతున్న ప్రమాణాల విధానాలు, భారతీయ హైడ్రోజన్ ప్రమాణాలను అంతర్జాతీయ అత్యుత్తమ విధానాలతో అనుసంధానించడానికి జరుగుతున్న ప్రయత్నాలపై వివరణ ఇచ్చింది.

సదస్సులోని సాంకేతిక కార్యక్రమాల్లో పరిశ్రమలు, విద్యాసంస్థలు, పరిశోధనా సంస్థలకు చెందిన ప్రముఖ నిపుణులు హైడ్రోజన్ వ్యవస్థలో పాటించాల్సిన భద్రతా పద్ధతులపై చర్చలు జరిపారు. భారత ఆటోమొబైల్ సంస్థ తయారీదారులు, ఎన్‌టీపీసీ లిమిటెడ్, ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్, పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ రెగ్యులేటరీ బోర్డు, సీఎస్ఐఆర్-నేషనల్ మెటలర్జికల్ లాబొరేటరీ, ఐఐటీ మద్రాస్ వంటి సంస్థల ప్రతినిధులు ఈ చర్చల్లో ప్రసంగించారు. హైడ్రోజన్ ఉత్పత్తి, నిల్వ, రవాణా వ్యవస్థల సురక్షిత రూపకల్పన, ప్రమాదాల అంచనా పద్ధతులు, గతంలో జరిగిన సంఘటనల విశ్లేషణ, హైడ్రోజన్ భద్రత కోసం ఆధునాతన సెన్సార్ సాంకేతికత, కృత్రిమ మేధ ఆధారిత పర్యవేక్షణ వంటి అత్యాధునిక ఆవిష్కరణల గురించి చర్చించారు. విశ్వసనీయమైన, గ్రీన్ హైడ్రోజన్ సాంకేతికతలను విస్తరించడానికి అవసరమైన ప్రమాణాల అభివృద్ధి, నియంత్రణ సామర్థ్య పెంపు, భద్రతా విధానాల రూపకల్పనలో సహకారాన్ని బలోపేతం చేసుకోవాలని భారత్-యూకే ఉమ్మడి నిబద్ధతతో ఈ సమావేశం ముగిసింది.

గ్రీన్ హైడ్రోజన్ సాంకేతికతలను సురక్షితంగా, పెద్ద ఎత్తున వినియోగంలోకి తీసుకురావడానికి అవసరమైన బలమైన ప్రమాణాలు, నియంత్రణ విధానాలు, భద్రతా నియమావళిని రూపొందించడంలో భారత్-యూకే మధ్య సహకారాన్ని బలోపేతం చేయాలనే భాగస్వామ్య నిబద్ధతతో ఈ సదస్సు ముగిసింది. ఈ చర్చలు జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ కింద కొనసాగుతున్న ప్రయత్నాలకు దోహదపడతాయని, తద్వారా సమగ్రమైన భద్రతా వ్యవస్థను నిర్మించడానికి, దేశంలో విశ్వసనీయమైన, ప్రపంచస్థాయి పోటీనిచ్చే గ్రీన్ హైడ్రోజన్ రంగం వృద్ధి చెందడానికి తోడ్పడతాయని భావిస్తున్నారు.

# ఒక్కటైన కాషాయం, కాంగ్రెస్.. కేసీఆర్ పాలనలో రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి రాలేదు : ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్



హైదరాబాద్, మార్చి 7: పదేండ్ల కేసీఆర్ పాలనలో రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి రాలేదని..ఎన్నికల ముందు చెప్పినట్లుగా రేవంత్ రెడ్డి సమైక్య రాష్ట్రంలో ఉన్న పరిస్థితులను తీసుకొచ్చారని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నంగునూరు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ధర్నా కార్యక్రమంలో శనివారం ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి రంగు మెలమెల్లగా ప్రజలకు తెలిసిపోతుంది తెలంగాణ రైతులు చాలా భాధలు అనుభవించారు. గోదావరి, కృష్ణా నదులు మన దగ్గరే ఉన్నా ప్రాజెక్టులకు నోచుకోని భూమి తెలంగాణ భూమి అని.. గోదావరి పుష్కరాలు ఆంధ్రలో మాత్రమే జరిగేవన్నారు. బోర్లు వేసి కరెంట్ రాక రైతులు ఆత్మహత్యలు చేసుకున్న పరిస్థితులు ఉండేవన్నారు.

జీవన్ రెడ్డి కాంగ్రెస్‌లో జీవన్మరణ సమస్య ఎదుర్కుంటున్నారు. కరెంట్ అడిగితే చంద్రబాబు రైతులను కాల్చి చంపిండు. ఆ పోరాటంలో నుంచి పుట్టిందే గులాబీ జెండా. నీళ్లు వస్తాయంటే రైతులకు, ప్రజలకు నాడు నమ్మకం లేకుండే. మూడు సంవత్సరాలలో 24 గంటల కరెంట్ ఇచ్చి చూపించారు కేసీఆర్. కరెంట్ ఇచ్చాక 3 సంవత్సరాలలోనే కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి చేశారు. అశోక్ గులాటి అనే వ్యవసాయ వేత్త చెప్పినట్టుగా కేసీఆర్ రైతుబంధు ప్రవేశ పెట్టారు. 72 వేల కోట్లు రైతు బంధు ఇచ్చిన నాయకుడు కెసీఆర్. రైతు బంధు అనే పథకాన్ని దేశంతోపాటు ప్రపంచమే గుర్తించిందన్నారు. రైతుల ఆత్మగౌరవం కేసీఆర్ కాపాడారు. కరోనా కాలంలో కూడా కేసీఆర్ రైతు బంధు ఆపలేదు.. మోసం చేసుడు మా లక్షణం అని రేవంత్ రెడ్డి ముందే చెప్పిండు అయినా ప్రజలు మోసపోయారన్నారు.

రైతు భీమాకు కిస్తీలు కూడా కట్టడం లేదు..

మెస్సీతోని ఫుట్ బాల్ ఆడేందుకు, అందాల పోటీలు పెట్టేందుకు రేవంత్ రెడ్డి కోట్ల రూపాయలు ఖర్చు పెట్టాడు. రేవంత్ రెడ్డి ఇల్లు కంచెల కోసం కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నరు. మూసీ అభివృద్ధి పేరిట కోట్ల రూపాయలు మూసీలో పోస్తుండు. ప్రజలంటే ప్రేమ ఉంది కాబట్టే హరీష్ రావు అభివృద్ధి చేశిండన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉంటే ఇప్పటికే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తయ్యేదని.. రైతు భీమాకు కిస్తీలు కూడా కట్టడం లేదు. కంఠంలో ప్రాణం ఉండగా మీటర్లు పెట్ట అని కేసీఆర్ చెప్పిండు. ఇప్పుడు కాషాయం, కాంగ్రెస్ ఒక్కటయ్యారన్నారు.

# ప్రగతిశీల, సమ్మిళిత భారతదేశ నిర్మాణంలో మహిళల కీలక పాత్రను

న్యూఢిల్లీ, మార్చి 7:రేపు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలోని కర్తవ్యపథ్ వద్ద "శక్తి వాక్-చషీలీడ్స్‌భారత్" పేరుతో మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ (ఎండబ్ల్యూసీడీ), మహిళల నేతృత్వంలో పాదయాత్రను నిర్వహిస్తుంది.

ప్రపంచవ్యాప్తంగా మార్చి 8న నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవం.. అన్ని రంగాల్లో మహిళలు సాధించిన విజయం, నాయకత్వం, విశేష కృషిని వేడుకగా జరుపుకుంటుంది. లింగ సమానత్వం, భద్రత, గౌరవం, సాధికారత దిశగా ఉమ్మడి నిబద్ధతను స్పష్టం చేస్తుంది. ఈ స్ఫూర్తితో ప్రగతి శీల, సమ్మిళిత భారతదేశ నిర్మాణంలో మహిళల కీలక పాత్రను చాటిచెప్పేందుకు శక్తి వాక్ నిర్వహించనున్నారు.

వివిధ రంగాల్లో మహిళలు కనబరిచిన నాయకత్వాన్ని, వారి అందించిన విశేష సేవలను వేడుకగా జరుపుకోవటం శక్తి వాక్ ప్రధాన లక్ష్యం. మహిళల భద్రత, రక్షణ, సాధికారత పట్ల ప్రభుత్వానికున్న నిబద్ధతను బలోపేతం చేయటం.. మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాల ప?రదర్శన, వివిధ రంగాలకు చెందిన మహిళలను ఒకచోట చేర్చి, వారి మధ్య ఐక్యతను, సమష్టి గౌరవాన్ని పెంపొందించటం, జాతీయ ప్రగతికి మహిళా నేతృత్వంలోని అభివృద్ధి అత్యంత కీలకమని చాటి చెప్పేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

ఉదయం 7:30 నుంచి 10 గంటల వరకు ఇండియా గేట్ నుంచి కర్తవ్యపథ్ మీదుగా విజయ్ చౌక్ వరకు సుమారు 2 కి.మీ. మేర ఈ నడక కార్యక్రమం సాగుతుంది.

ఈ కార్యక్రమంలో సాయుధ దళాలు, పోలీసు శాఖ, మీడియా, వైద్య రంగం, క్రీడలు, ప్రభుత్వ సంస్థలు, పరిశ్రమలు, క్షేత్రస్థాయి కంపెనీల ప్రతినిధులతో సహా 150కి పైగా మంత్రిత్వ శాఖలు, విభాగాలు, సంస్థల నుంచి సుమారు 3000 మంది మహిళలు పాల్గొంటారని అంచనా. ప్రగతిశీల, సమ్మిళిత భారతదేశ నిర్మాణంలో మహిళల కీలక పాత్రను తెలియజేస్తూ చషీలీడ్స్‌భారత్ ఇతివృత్తంతో సాగే ఈ శక్తి వాక్‌లో వివిధ రంగాలకు చెందిన మహిళలు పాల్గొంటారు. భారత ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలకు చెందిన మహిళా అధికారులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు. అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కానున్నారు. ఈ శక్తి వాక్‌కు కేంద్రమంత్రులు, సహాయమంత్రులు, పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు వంటి మహిళా ప్రజా ప్రతినిధులతో పాటు వివిధ రంగాల్లోని ప్రముఖ మహిళా నాయకురాళ్లు, విశిష్ట అతిథులు నాయకత్వం వహిస్తారు.

# ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని నిరంతరం శ్రమించాలి: పి ప్రావీణ్య జిల్లా కలెక్టర్



సంగారెడ్డి, మార్చి 07 (నేటి నిజం ప్రతినిధి) ఐదు నెలల శిక్షణలో పొందిన నైపుణ్యాలను ఆసరాగా చేసుకుని ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని వాటి సాధన కోసం నిరంతరం శ్రమించాలని జిల్లా కలెక్టర్ పీ ప్రావీణ్య అన్నారు. శనివారం సంగారెడ్డి లోని బీసీ స్టడీ సర్కిల్ లో సివిల్స్, గ్రూప్స్, ఆర్ఆర్బీ, బ్యాంకింగ్ పరీక్షలకు శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు తన నిధులతో ఉచితంగా స్టడీ మెటీరియల్ ను కలెక్టర్ అందజేశారు . ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నోటిఫికేషన్లు ఇప్పుడు వస్తాయో తెలియదు ,కాబట్టి విద్యార్థులు శిక్షణలో పొందిన జ్ఞానానికి అదనపు జ్ఞాన సముపార్జన కోసం స్టడీ మెటీరియల్ దోహదం చేస్తుందన్నారు. తమ సమయాన్ని వృధా చేయకుండా నోటిఫికేషన్ వచ్చిన ప్రతి పరీక్ష కు హాజరై తమ జ్ఞానాన్ని పెంపొందించుకొని తమ లక్ష్యాలను చేరుకోవాలని ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి, బిసి స్టడీ సర్కిల్ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

# విశాఖలో గూగుల్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి..




## రైసినా డైలాగ్‌లో సీఎం వెల్లడి

-ఏఐ క్వాంటం టెక్నాలజీతో ఏపీ భవిష్యత్..
-ప్రపంచ వేదికపై చంద్రబాబు విజన్
-గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి.. భవిష్యత్‌లో విద్యుత్ ఎగుమతి
-మినీ కాదు.. మెగా ఫ్యామిలీ కావాలి
-జనాభా పాలసీపై సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు
-రైసినా డైలాగ్‌లో చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు..

అమరావతి, మార్చి 7:రైసినా డైలాగ్ 2026 సదస్సులో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. అమరావతిని క్వాంటం వ్యాలీగా అభివృద్ధి చేస్తామని, విశాఖలో గూగుల్ డేటా సెంటర్ పెట్టుబడులు, గ్రీన్ ఎనర్జీ, ఏఐ టెక్నాలజీపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని తెలిపారు. అభివృద్ధి సాంకేతికత రంగం వైపు భారత్? శరవేగంగా దూసుకు వెళ్తోందని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. 2016 నుంచి నిర్వహిస్తున్న రైసినా డైలాగ్ 2026 సదస్సులో తొలిసారిగా ఓ రాష్ట్ర ముఖ్యమంత్రిని రైసినా డైలాగ్ నిర్వాహకులుచ ఆహ్వానం పలి 0 కారు. 110 దేశాల నుంచి 2700 మందికి పైగా ప్రతినిధులు, మేధావులు, నిపుణులు, వ్యూహకర్తలు , కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్ సహా ఇతర ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, మూడు దశాబ్దాల కిందట అందిపుచ్చుకున్న ఐటీ విప్లవం ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలకు తెలుగు రాష్ట్రాల నిపుణులను అందించిందని సీఎం హర్షం వ్యక్తం చేశారు. నాలెడ్జి ఎకానమీలో లీడింగ్ భాగస్వామిగా భారత్ ఉందని 60 శాతం జీసీసీలు భారత్ లో ఏర్పాడ్డాయని ఆయన స్పష్టం చేశారు. డిజిటల్ కరెన్సీ సంస్కరణలతో యూపీఐ పేమెంట్ వ్యవస్థ కూడా కీలకంగా మారిందన్న సీఎం చంద్రబాబు వివరించారు. గూగుల్ సంస్థ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటునకు ముందుకు వచ్చిందని సీఎం తెలిపారు.

క్వాంటం కంప్యూటింగ్ తో అమరావతిని క్వాంటం వ్యాలీగా మారుస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. త్వరలోనే క్వాంటం కంప్యూటింగ్ పరికరాలను కూడా తయారు చేసి ప్రపంచానికి అందిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఐటీ విప్లవం అందిపుచ్చుకున్నప్పుడు అంతా విమర్శించారు. కానీ ఇప్పుడు హైదరాబాద్ నాలెడ్జి ఎకానమీకి కేంద్రంగా మారింది, ఇప్పుడు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అనేది గేమ్ చేంజర్ గా మారబోతోంది. ఏఐ, క్వాంటం కంప్యూటర్లను ఎలా వినియోగించుకుంటామన్న అంశం ఆధారంగానే వాటి భవిష్యత్తు మారుతుంది.

సైబరాబాద్ తో పాటు అమరావతిని బ్లూ గ్రీన్ సిటీగా నిర్మించే అవకాశాన్ని భగవంతుడు నాకు కల్పించాడు, అని సీఎం చంద్రబాబు నాయుడు బావోద్వేగంతో వివరించారు. టెక్నాలజీని, ఇన్ ఫ్రాను మిళితం చేసి కాలుష్య రహిత నగరంగా అమరావతిని నిర్మిస్తున్నాం, ప్రముఖ ఐటీ కంపెనీలను భారతీయులే లీడ్ చేస్తున్నారు. అమరావతిలో గ్లోబల్ లీడర్షిప్ సెంటర్ ను ఏర్పాటు చేస్తున్నాం, అని సగర్వంగా సీఎం చంద్రబాబు వెల్లడించారు.

సహనం అనే పునాదులపై భారతీయ సంప్రదాయ మూలాలు ఉన్నాయి. సహకార ఫెడరలిజం అనే అంశంపై కేంద్ర, రాష్ట్రాలు పనిచేస్తున్నాయి. వివిధ రకాల సంస్కరణల ద్వారా వచ్చిన వివిధ పాలసీలు స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలను అమలు చేస్తాయి. అదే సమయంలో ప్రజల జీవన ప్రమాణాలను కూడా అత్యున్నతంగా తీర్చిదిద్దేలా కార్యాచరణ చేపడుతున్నాం, అని సీఎం వివరించారు.

ప్రపంచంలో ఎక్కడైనా భారతీయులే అత్యుత్తమ డిపామాట్స్. ఎక్కడికి వెళ్లినా స్థానికులతో కలిసి మెలిసి నివసించటంలో వారికి మించిన వారులేరు. ప్రపంచ దేశాలకు విస్తృత సేవలు అందిస్తు న్న వారిలో భారతీయులే ఎక్కువ. ప్రత్యేకించి ఐటీ సహా వివిధ రంగాల్లో గ్లోబల్ కమ్యూనిటీకి, ప్రపంచ సంక్షేమానికి భారతీ యులు సేవలు అందిస్తున్నారు. గతంలో భారతీయ నిపుణులు సిలికాన్ వ్యాలీ లాంటి చోటుకు మేధో వలస జరిగింది. కానీ త్వరలో రివర్స్ మై గ్రేషన్ అంటే ఏమిటో మొదలవుతుందిచ సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

నిపుణులు, వనరులు ఉన్న చోటుకే అవకాశాలు వెతుక్కుంటూ వస్తున్నాయి. ప్రస్తుతం దూరాలు అనేవి ఒక అంశం కాదు. ఎక్కడి నుంచైనా పనిచేసేందుకు అవకాశాలు ఉన్నాయి. నాలెడ్జ్ ఎకానమీలో భాగంగా ఎక్కడైనా ఓ పెద్ద కంపెనీని ప్రారంభించి పనిచేసేందుకు అవకాశం ఉంది. త్వరలో డేటా సెంటర్ ల కోసం గ్రీన్ ఎనర్జీని పెద్ద ఎత్తున ఉత్పత్తి చేస్తున్నాం. భారత్ లో ప్రస్తుతం సింగిల్ గ్రిడ్ ద్వారా ఎనర్జీ ట్రాన్స్ఫర్మేషన్ జరుగుతోంది. గ్రీన్ ఎనర్జీ కారిడార్ తో పాటు ఇతర సంప్రదాయ విద్యుత్ కారిడార్ లు ఉంటాయి, అని సీఎం చంద్రబాబు వివరిం చారు, త్వరలోనే భారత్ విద్యుత్ ను ఎగుమతి చేసేందుకు ప్రయత్నాలు చేస్తోంది. గ్రీన్ అమ్మోనియా కూడా ఏపీలో ఉత్పత్తి చేస్తున్నాం, ఏఐ సహా క్వాంటం ఏఐ ఆల్గారిథమ్స్ కోసం పెద్ద ఎత్తున అవకాశాలు ఉంటాయి. ఇటీవల ట్రైనింగ్ కోసం కోసం పిలుపు ఇస్తే 50 వేల మంది రిజి స్టర్ చేసుకుని శిక్షణ పొందు తున్నారు

వయో భార సమస్యను ఎదుర్కొంటున్న దేశాలు జనాభా నిర్వహణపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అందుకే ఫెర్టిలిటీ రేటును పెంచేలా పాపులేషన్ మేనేజ్జ పాలసీని రూపొందించాం. 1.5 నుంచి 2.1కు ఫెర్టిలిటీ రేటు పెరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. మూడో బిడ్డ పుడితే రూ.25 వేల ఆర్థిక సాయం, నెలలవారీగా రూ.1 వెయ్యి అందించాలని నిర్ణయించాం. అలాగే చైల్డ్ కేర్ లీవ్ లాంటి ప్రోత్సాహకాలను అందించాలని ఆలోచన చేస్తున్నాం ఓ ప్రజాప్రతినిధిగా గతంలో జనాభా నియంత్రణ పై మాట్లాడాను. ఇప్పుడు భవిష్యత్ ప్రమాదాన్ని గుర్తించి జనాభా నిర్వహణ పాలసీని ప్రోత్సహిస్తున్నాను. పేద, ధనిక అనే తారతమ్యం లేకుండా ఇప్పుడు జనాభా వృద్ధిపై దృష్టి పెట్టాల్సిన సమయం ఆసన్నమైంది. భారత్ లో గతంలో పెద్ద కుటుంబ వ్యవస్థలు ఉండేవి. దేశానికి అదో పెద్ద ఆస్తి కూడా. ప్రస్తుతం మైక్రో ఫ్యామిలీలుగా మారాయి. ఈ విషయంలో ప్రజల దృష్టి కోణం మార్చాలన్న ప్రయత్నంలో ఉన్నాం, అని కుటుంబ వ్యవస్థపై భావోద్వేగంగా సీఎం చంద్రబాబు నాయుడు విశదీకరించారు.

ప్రపంచ వ్యాప్తంగా తెలుగు ప్రజలు ఉన్నత స్థానాల్లో ఉండడానికి 30 ఏళ్ల కిందట తీసుకున్న వివిధ సంస్కరణలతో కూడిన నిర్ణయాలే కారణం. నాలెడ్జి ఎకనామీ ద్వారా ప్రపంచ దేశాలకు నైపుణ్యాలను అందిస్తున్నాం. త్వరలోనే ప్రొడక్ట్ పర్ఫెక్షన్ ద్వారా ప్రపంచానికి అత్యుత్తమ ఉత్పత్తులను సరఫరా చేస్తాం. 9 అంశాలతో కూడిన నగరాలను అమరావతిలో ఏర్పాటు చేస్తున్నాం. క్రియేటివ్ సిటీని కూడా ఏర్పాటు చేయబోతున్నాం. ప్రైవేటు శాటిలైట్లను కూడా తయారు చేసి లాంచ్ చేసేలా ఓ స్పేస్ సిటీని, డ్రోన్ల కోసం డ్రోన్ సిటీని ఏర్పాటు చేస్తున్నాం. ఎలక్ట్రానిక్స్, ఏరో స్పేస్ సిటీని ఏర్పాటు చేసి పెట్టుబడులను ఆకర్షిస్తున్నాం. ప్రివెంటివ్ హెల్త్ అనేది రియాలిటీ, క్యూరేటివ్ విధానంపైనా అంతా దృష్టి సారించాల్సి ఉంది. డ్రోన్ అంబులెన్స్ కూడా త్వరలోనే రియాలిటీగా మారబోతోంది. మేధావులు, నిపుణులు, వ్యూహ కర్తలు ఇచ్చిన ఆలోచనల్ని అమ లు చేసేందుకు భారత్ తో పాటు ఏపీ సదా సన్నద్ధంగా ఉంటుంది, అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## హైదరాబాద్‌లో కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ గుట్టురట్టు.. టాస్క్ ఫోర్స్ మెరుపు దాడులు

హైదరాబాద్, మార్చి 7: నగర ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెడుతూ కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను తయారు చేస్తున్న ఒక భారీ ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. హైదరాబాద్ లోని లాలా పేట పరిధిలో నిర్వహిస్తున్న ఒక గోడౌన్ పై టాస్క్ ఫోర్స్ సికింద్రాబాద్ జోన్, లాలాగూడ పోలీసులు సంయుక్తంగా మెరుపుదాడులు నిర్వహించారు. సికింద్రాబాద్ జోన్ టాస్క్ ఫోర్స్ బృందానికి అందిన ముందస్తు సమాచారంతో లాలాగూడ పోలీసులతో కలిసి లాలాపేటలోని 'జానీ అల్లం వెల్లుల్లి పేస్ట్' గోడౌన్ పై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడిలో అత్యంత అపరిశుభ్రమైన వాతావరణంలో ప్రమాదకర రసాయనాలను ఉపయోగించి అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.o

అల్లం, వెల్లుల్లి పేస్ట్ ఎక్కువ రోజులు నిల్వ ఉండాలని, రంగు మారకుండా ఉండటానికి నిందితులు ఎసిటిన్ యాసిడ్ వంటి రసాయనాలు కలుపుతున్నట్లు తేలింది. ఈ సోదాల్లో దాదాపు 1,915 కిలోల కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్, 30 కిలోల ఎసిటిక్ యాసిడ్, పేస్టు తయారీకి ఉపయోగించే యంత్రాలు, ఇతర ముడి సరకులు, ప్యాకింగ్ మెటీరియల్ ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు నీలా వెంకటేశ్వర్లుతోపాటు మరో ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. మొత్తం నలుగురు నిందితులను తదుపరి విచారణ నిమిత్తం లాలాగూడ పోలీసులు తీసుకెళ్లారు. నకిలీ బ్రాండ్ లేబుల్స్ తో ప్యాకింగ్ చేసి నగరాల్లోని పలు కిరాణా దుకాణాలకు సరఫరా చేస్తున్నారని పోలీసులు తెలిపారు.


# అన్ని వసతులతో నూతన కోర్టు భవన సముదాయం

-కక్షిదారులకు సత్వర న్యాయం సౌలభ్యాలు
-రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్



రాజన్న సిరిసిల్ల, మార్చి 7: నేటినిజం (ప్రతినిధి): కక్షిదారులకు సత్వరన్యాయం అందించేందుకు అన్ని వసతులతో నూతన కోర్టు భవన సముదాయాలు నిర్మిస్తున్నామని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ తెలిపారు. సిరిసిల్లలో సుమారు 5 ఎకరాల విస్తీర్ణంలో రూ.81 కోట్ల 60 లక్షల వ్యయంతో 12 రకాల న్యాయస్థానాలు సెల్లార్తోపాటు టెన్ ప్లస్ టు శైలిలో నిర్మాణానికి శనివారం భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించగా, రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ వర్చువల్ విధానంలో శంకుస్థాపన లో పాల్గొనగా, సిరిసిల్లలో హైకోర్టు న్యాయమూర్తి కం జిల్లా కోర్టు పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ ఎన్ తుకారాంజీ, జస్టిస్ కె లక్ష్మణ్, జస్టిస్ విజయసేన్ రెడ్డి, జస్టిస్ నందికొండ నర్సింగరావు, జస్టిస్ ఇవి వేణుగోపాల్, జస్టిస్ పుల్లా కార్తీక్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పీ నీరజ, కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే హాజంయ్యారు. ఈ సందర్భంగా సర్వమత ప్రార్థనలు చేసి.. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వర్చువల్ విధానంలో రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కుల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. నూతన కోర్టు భవన సముదాయం అన్ని కోర్టుల నిర్వహణకు సరిపోయే విధంగా ఉంటుందని వెల్లడించారు. నూతన కోర్టులో మౌలిక వసతులతోపాటు తగినంత సిబ్బంది ఉండాలని సూచించారు సిరిసిల్ల జిల్లాకు భౌగోళికంగా, పరిపాలన పరంగా ప్రాముఖ్యత ఉందని, వ్యవసాయం జీవనోపాధితో అభివృద్ధి చెందుతున్న జిల్లా అని పేర్కొన్నారు. ఇక్కడ చేనేత పరిశ్రమ ఎంతో ప్రసిద్ధి పొందింది అని పేర్కొన్నారు. నూతన కోర్టు భవన సముదాయంతో కోర్టు కు వచ్చే కక్షిదారులకు సత్వర న్యాయం లభించాలని, ఈ దిశగా న్యాయవాదులు, న్యాయ మూర్తులు సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. జిల్లా కోర్టులో 13 వేల కేసులు పైగా కేసులు పెండింగ్ లో నున్నట్లు తెలిపారు. పెండింగ్ కేస్ ల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని, సంబంధిత అధికారులు సమన్వయముతో పని చేయాలని ఆదేశించారు. న్యాయవ్యవస్థ పై విశ్వాసం మరింత బలోపేతంఈ నూతన కోర్టు భవన నిర్మాణం ప్రజల్లో న్యాయవ్యవస్థపై విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే కొత్త అధ్యాయానికి నాందిగా నిలుస్తుందని హైకోర్టు న్యాయమూర్తి కం జిల్లా కోర్టు పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ ఎన్ తుకారాంజీ పేర్కొన్నారు. రాజ్యాంగం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రతి పౌరుడికి సామాజిక న్యాయం అందేలా న్యాయవ్యవస్థ పని చేయాలన్నారు. ప్రతి పౌరుడు న్యాయస్థానాన్ని ఆశతో, నమ్మకంతో ఆశ్రయించేలా వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. నూతన కోర్టు భవనం నిర్మాణం ద్వారా మౌలిక సదుపాయాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ప్రజలకు మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా సేవలు అందేలా అవకాశం ఏర్పడుతుందని వివరించారు. ఇది కేవలం ఒక భవనం మాత్రమే కాకుండా రాజ్యాంగ విలువలను కాపాడే న్యాయవ్యవస్థకు ఉన్న నిబద్ధతకు ప్రతీకగా నిలుస్తుందని చెప్పారు. నిష్పక్షపాతం.. నైతిక విలువలు కాపాడడం అత్యంత ముఖ్యమని ఆ దిశగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సామాజిక న్యాయం, న్యాయ పరిపాలన, సమానత్వం, నాణ్యమైన న్యాయ సేవలు అందేలా న్యాయ మూర్తులు, న్యాయవాదులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. బార్ సభ్యులు సత్యాన్ని వెలికితీసే బాధ్యతతో పని చేస్తూ ప్రజలకు న్యాయం అందేలా అంకిత భావంతో ముందుకు సాగాలని సూచించారు. సిరిసిల్ల జిల్లా సంపదకు కేంద్రం, చరిత్రకు నిలయంరాజన్న సిరిసిల్ల జిల్లా చరిత్ర, సంస్కృతి, పరిశ్రమలతో ప్రసిద్ధి పొందిన ప్రాంతం అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పీ నీరజ పేర్కొన్నారు పెద్ద టెక్స్టైల్ పవర్ లామ్ కేంద్రంగా ఎదిగి వేలాది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్నదని చెప్పారు. సిరిసిల్లను పవర్‌లూమ్ నగరంగా కూడా పిలుస్తారనీ. ఇక్కడ వేలాది మంది నేత కార్మికులు పగలు రాత్రి శ్రమించి దేశవ్యాప్తంగా పేరు పొందిన వస్త్రాలను తయారు చేస్తున్నారని తెలిపారు. సిరిసిల్లలో ఉన్న వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం దేశంలో ప్రసిద్ధి చెందిన పవిత్రక్షేత్రాలలో ఒకటి. ప్రతి సంవత్సరం వేలాది మంది భక్తులు ఇక్కడికి వచ్చి స్వామివారిని దర్శించుకుంటారనీ. ఈ ఆలయం ఈ ప్రాంతానికి చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను తెచ్చిపెట్టిందనీ తెలిపారు. సిరిసిల్ల జిల్లా ప్రత్యేకతల్లో నేత కార్మికుల పాత్ర ఎంతో గొప్పదన్నారు. ఇక్కడి నేత కార్మికులు తయారు చేసే చీరలు, పాఠశాల విద్యార్థుల యూనిఫామ్‌లు, ఇతర వస్త్రాలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందా యని, వేలాది కుటుంబాలు ఈ టెక్స్టైల్ పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయని చెప్పారు. అందుకే సిరిసిల్లను చరిత్ర, ఆధ్యాత్మికత, పరిశ్రమలు కలిసిన సంపద నగరంగా పేర్కొంటారని గుర్తు చేశారు. తెలంగాణలో అభివృద్ధి, సంస్కృతి, కార్మికుల కృషికి ప్రతీకగా నిలిచిన సిరిసిల్ల ఒక ముఖ్యమైన జిల్లాగా ప్రఖ్యాతి గాంచిందని పేర్కొన్నారు. ల్యాప్ టాప్ లు పంపిణీ..జిల్లా సంక్షేమ శాఖ ఆద్వర్యంలో దివ్యాంగ డిగ్రీ, ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు ల్యాప్ టాప్ లు, దివ్యాంగులకు బ్యాటరీ వీల్ చైర్లు, ఎంపవర్ కార్ట్ లు హై కోర్టు న్యాయమూర్తులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, కలెక్టర్, ఎస్పీతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారుల, విద్యాంస్థల నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. హైకోర్టు న్యాయమూర్తులకు సన్మానంఅనంతరం హై కోర్టు న్యాయమూర్తులను జిల్లా కోర్టులు, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాధ్యులు, జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, అదనపు ఎస్పీ చంద్రయ్య, ఎవ అదనపు జిల్లా జడ్జి పి పుష్పలత పోక్సో కోర్టు న్యాయమూర్తి రాధిక జైస్వాల్, సీనియర్ సివిల్ జడ్జి, సిరిసిల్ల - కమ్ - ఎఫ్ ఏ సీ: కార్యదర్శి, డీ ఎల్ ఎస్ ఏ పి.లక్ష్మణాచారి, సీనియర్ సివిల్ జడ్జి, వేములవాడ అజయ్ కుమార్ జాదవ్, ఆర్డీఓ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్, వేములవాడ జూనియర్ సివిల్ జడ్జి, జ్యోతిర్మయి, సిరిసిల్ల అదనపు జూనియర్ సివిల్ జడ్జిలు కావేటి సృజన, మిస్.గడ్డం మేఘన, సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు జూపల్లి శ్రీనివాసరావు, వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం, డీఎస్పీ నాగేంద్రచారి, తహసీల్దార్ మహేష్ కుమార్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, గవర్నమెంట్ ప్లీడర్స్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు తదితరులు పాల్గొన్నారు.

# హైకోర్టు జడ్జిని కలిసిన కిడ్స్ కాన్వెంట్ అధినేత హసన్ ఫసివుల్లా



రాజన్న సిరిసిల్ల, మార్చి 7: నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నూతన కోర్టు భవన నిర్మాణానికి నిర్వహించిన భూమి పూజ కార్యక్రమానికి విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తి ఈ.వి వేణుగోపాల్‌ను వేములవాడ పట్టణానికి చెందిన కిడ్స్ కాన్వెంట్ స్కూల్ అధినేత హసన్ ఫసివుల్లా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హసన్ ఫసివుల్లాతో పాటు సిరిసిల్ల పట్టణానికి చెందిన బాల్యమిత్రులు కూడా న్యాయమూర్తి ఈ.వి. వేణుగోపాల్‌ను కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

హైస్కూల్, కళాశాల రోజులలో మైదానంలో కలిసి క్రికెట్ ఆడుతూ గడిపిన ఆనందకర క్షణాలను గుర్తుచేసుకుంటూ కొద్దిసేపు ఆత్మీయంగా ముచ్చటించారు. అనంతరం న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించి సత్కరించారు.

# దివ్యాంగులకు ఎమ్మెల్యే కూనంనేని సహాయ ఉపకరణాలు పంపిణీ

ఖమ్మం, మార్చి 7:దివ్యాంగులకు వారి దినచర్యలో సహాయ ఉపకారణాలు ఎంతో ఉపయోగపడతాయని, లబ్ధిదారులు జాగ్రత్తగా వినియోగించుకోవాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివా రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో దివ్యాంగులకు సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమం జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లేనినా అధ్యక్షతన జరిగింది. జిల్లాలోని దివ్యాంగులు సహాయ ఉపకరణాల కోసం tgobmms.cgg.gov.in వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోగా జిల్లా సెలెక్షన్ కమిటీ ఎంపిక చేసిన వారికి తెలంగాణ వికలాంగుల కోపరేటివ్ కార్పొరేషన్ ద్వారా అందచేసిన సహాయ ఉపకరణాలు కొత్తగూడెం నియోజకవర్గ లబ్ధిదారులకు శనివారం ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెట్రో ఫిట్టెడ్ మోటర్ వెహికల్స్ (స్కూటీ) అర్హులైన లబ్ధిదారులకు సి.ఎస్.ఆర్. ద్వారా సహాయ ఉపకరణాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

-సర్పంచ్ శ్యామల

నల్గొండ, మార్చి 7: పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కట్టంగూర్ సర్పంచ్ ముక్కామల శ్యామల శేఖర్ అన్నారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం రెండో రోజు పాలకవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు ఉన్నత పాఠశాల పరిసరాలు, వంటశాలను శుభ్రం చేసి చెత్తాచెదారం తొలగించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులు, వంట కార్మికులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ అంబటి అంజయ్య, పంచాయతీ కార్యదర్శి వడ్లకొండ అశోక్, ఉప సర్పంచ్ గుండు రాంబాబు, వార్డ సభ్యులు ఏకుల సుజాత, కల్లెం నాగేశ్వర్ రావ, అయితగోని సైదులు, ముషం రాణి, కానుగు సైదమ్మ, యర్కల శశి, సంధ్య, శ్రీను పాల్గొన్నారు.

# క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

-గౌతమ్ మోడల్ స్కూల్ వార్షికోత్సవంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
-కనువిందు చేసిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు




రాజన్న సిరిసిల్ల, మార్చి 7: నేటినిజం (ప్రతినిధి): విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తద్వారా సమాజానికి ఆదర్శంగా నిలవాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం వేములవాడ పట్టణంలోని గౌతమ్ మోడల్ స్కూల్ 14వ వార్షికోత్సవం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ..తల్లిదండ్రులు తమ పిల్లల చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారు పాఠశాల నుంచి ఇంటికి వచ్చాక ఏం చేస్తున్నారో నిరంతరం గమనించాలని సూచించారు. పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు తమ వినోదాలను, ముఖ్యంగా టీవీ సీరియల్స్ వంటి వాటిని పక్కన పెట్టి వారికి చేదోడువాదోడుగా నిలవాలని కోరారు. ఉపాధ్యాయులు కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా, ప్రతి విద్యార్థిలో దాగి ఉన్న ప్రత్యేక ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించిందని, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలల'ను నిర్మిస్తున్నామని ఆయన వివరించారు. పట్టుద లతో చదివితే ఏదైనా సాధిం చవచ్చని విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు. గౌతమ్ మోడల్ పాఠశాలల చైర్మన్ వెంకట నారాయణ మాట్లాడుతూ.గత 14 సంవత్సరాలుగా పాఠశాలను విజయవంతంగా నిర్వహిస్తూ, వేములవాడ నియోజకవర్గంలోనే ప్రథమ స్థానంలో నిలుపుతున్న పాఠశాల యాజమాన్యాన్ని ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభి నందించారు. అనంతరం విద్యార్థు లు ప్రదర్శించిన సాంస్కృ తిక కార్యక్రమాలు సభికులను విశేషం గా ఆకట్టుకున్నాయి. చిన్నారులు చేసిన నృత్యాలు, సమూహ గీతా లు, రంగస్థల ప్రదర్శనలు ప్రేక్ష కులను మంత్ర ముగ్ధులను చేశా యి. ఈ కార్యక్రమంలో పాఠశా ల కరస్పాండెంట్ బూర ఉమా రమేష్, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనిక రపు రాకేష్, కౌన్సిలర్లు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, సర్పంచ్ రంగు వెంకటేశం గౌడ్, ప్రిన్సిపల్ హరికిషన్, ఉపాధ్యాయులు, బూర శివ సాయి చరణ్,విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# "విశ్వశక్తి" స్వరూపణి - "మహిళ"



## ప్రస్తావన:

దేవీసూక్తం స్త్రీ ని (మహిళ) అగ్రస్థానాన నిలబెట్టింది. బ్రహ్మమానసపుత్రిక "దేవి" (స్త్రీ ) అని, ఆమె నుంచే ప్రకృతి, పురుషుడు ఉద్భవించారని చెబుతోంది. భారతీయ సంప్రదాయం పంచభూతాలలో నీరు, భూమి ఈ రెండింటినీ స్త్రీ స్వరూపంగానే భావించి, భూమాత, నదీమాత అంటూ ఋషులు, ఋగ్వేదంలోని దేవీసూక్తం, స్త్రీని విశ్వశక్తి స్వరూపణి గా ఉపనిషత్తులు, శాస్త్రాలు స్త్రీకి ప్రాముఖ్యతనిచ్చి గౌరవించింది.

**"యత్ర నార్యస్తు పూజ్యంతే,**
**రమంతే తత్ర దేవతాః"**

అర్థం: స్త్రీలు ఎక్కడ పూజింపబడతారో (గౌరవించబడతారో), అక్కడ దేవతలు కొలువై ఉంటారని ప్రతీతి. ఇది మనుస్మృతిలోని ఒక పవిత్ర శ్లోకం. ఇది స్త్రీలకు సమాజంలో అత్యున్నత స్థానం కల్పిస్తూ, వారిని ఆదిపరాశక్తి స్వరూపాలుగా గౌరవించాలని పురాణ ఇతిహాసం చెబుతుంది. "ఎక్కడ స్త్రీలు పూజించబడతారో" అక్కడ దేవతలు సంచరిస్తారు, అంటోంది భారతీయ సంస్కృతి. త్రిమూర్తులకు మూలమైన ఆదిపరాశక్తి స్త్రీ. ప్రకృతిని స్త్రీ రూపంగా చెప్పాయి వేదాలు. మాతృదేవోభవ అని తల్లిని ప్రత్యక్ష దైవంగా పూజించమన్నారు. ఋగ్వేదం స్త్రీ ఔన్నత్యాన్ని ప్రశంసించింది. స్త్రీని సాధికారత కలిగిన స్వరూపంగా పేర్కొన్నాయి. మహిళ తనకి తను స్వగతంలో, 'నేను మహారాణిని, సంపదను సేకరిస్తాను, ఆలోచిస్తాను. తొలి వందనం స్వీకరిస్తాను, అందువల్లే భగవంతుడు నన్ను ప్రతి ఇంట్లోను నెలకొల్పాడు. నా కారణంగానే ఇంటిల్లిపాదీ ఆహారం తీసుకుంటారు, గాలి పీలుస్తారు, వింటారు, మాట్లాడతారు' అంటుంది. పిల్లలకు తల్లి అదిగురువై విద్యాబుద్ధులు నేర్పించి వ్యక్తిగా సమాజానికి అందిస్తాను. ఇంతటి ఔన్నత్యమున్న స్త్రీకి దేవీసూక్తం "స్త్రీని" అగ్రస్థానాన నిలబెట్టింది.

## మహిళలు విప్లవం దిశగా :

పూర్వం స్త్రీలు ఇంటిపట్టున ఉండి, ఇంటి పనులు మాత్రమే చేసుకొనేవారు. వివాహితలు ఇంటిని చక్కదిద్దుకుంటూ భర్త, పిల్లల యొక్క బాగోగులు చూసుకొనేవారు. ఆ విధంగా గృహిణి పాత్ర నూటికి నూరు శాతం నిర్వహించేది. రాజ్యంలో యుద్ధానికి వెళ్ళే పరిస్థితుల్లో పురుషులను లేదా భార్య కుంకుమ దిద్ద సమాయత్తపరిచేవారు. తదనం తరం కాలం, స్త్రీలు బయటకు వచ్చి పురుషులతో సమానంగా చదువుతూ, ఉద్యోగాలు చేస్తూ, పరిమితమైన విజయాల్ని మాత్రమే దక్కించుకుంటున్న నేపథ్యంలో.... పరిణతి చెందిన మహిళ కాలక్రమాన లింగ బేధ కారణంగా చూపుతున్న అలక్ష్యాన్ని సహించలేక యాజమాన్యంపై ఉద్యమించడం మొదలుపెట్టింది. 1908 సంవత్సరంలో మహిళలకు తక్కువ గంటలు, మెరుగైన ప్యాకేజీ, ఓటు హక్కు కోసం న్యూయార్క్ నగరంలో 15 వేల మంది మహిళలు పురుషులతో సమానంగా వేతనం, పనిగంటలు ఇంకా ఇతరితర హక్కుల కోసం తీవ్ర పోరాటంలో భారీ ప్రదర్శన చేశారు. మహిళల ఈ డిమాండ్లను అమెరికాలోని సోషలిస్ట్ పార్టీ 1909 సంవత్సరంలో జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రకటించింది. రెడీమేడ్ గార్మెంట్స్ కార్మికులపై జరుగుతున్న అణచివేతను ఖండిస్తూ, 1910 సంవత్సరంలో సోషలిస్ట్ "ఇంటర్నేషనల్ కోపెన్ హాగన్" సమావేశంలో మహిళా దినోత్సవానికి అంతర్జాతీయ హోదా లభించింది.

## తొలిసారిగా మహిళా దినోత్సవం..

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మొట్టమొదటిసారిగా 1911లో ఆస్ట్రియా, డెన్మార్క్, జర్మనీ, స్విట్జర్లాండ్ దేశాల్లో నిర్వహించారు. 1913లో రష్యాలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజును అధికారిక సెలవు - రోజుగా ప్రకటించారు. 1917 లో ఫిబ్రవరి విప్లవం ఆ నెల చివరి ఆదివారం సెయంట్ పీటర్స్ బర్గ్లో మహిళా దినోత్సవం జరుపుకోవడంతో మొదలయ్యింది. (గ్రిగేరియన్ కాలెండరు ప్రకారం ఆ తారీఖు మార్చి 8 మొదటి ప్రపంచ యుద్ధం, రష్యాలోని ఆహార కొరత ముగిసిపోవాలని నినదించారు. అందుకే ప్రతి ఏటా మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నప్పటికి, 1975వ సంవత్సరంలో ఐక్యరాజ్య సమితి అధికారికంగా గుర్తించింది. ఈ నేపథ్యంలో 1975, 1977లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఐక్యరాజ్య సమితి నిర్వహించి, సంబరాలు ప్రారంభించింది. తదనంతరం, ఐక్యరాజ్యసమితి మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా మహాసభ ప్రకటించింది. ఈ రోజున మహిళల హక్కులను కాపాడేందుకు, ప్రపంచవ్యాప్తంగా మహిళలు శాంతియుతంగా జీవించేందుకు చర్యలు తీసుకోవడానికి కట్టుబడి ఉంది. ప్రతి సంవత్సరం మహిళా దినోత్సవం సందర్భంగా కొత్త థీమ్ను ప్రవేశపెడుతుంది.

## ఈ ఏడాది మహిళా దినోత్సవ సందేశం :

ఈ ఏడాది మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని, "మహిళా శక్తి దిశ" సమానత్వం నుంచి నాయకత్వం వరకు. మహిళా దినోత్సవం కేవలం ఒక ఉత్సవం కాదు. అది మార్పుకు మార్గదర్శక దీప్తి. నేటి మహిళ కేవలం కుటుంబ పరిమితుల్లోనే కాదు, ప్రపంచాన్ని ప్రభావితం చేసే నాయకురాలుగా ఎదుగుతోంది. విజ్ఞానం, సాంకేతికత, రాజకీయాలు, వ్యవసాయం, వ్యాపారం, ప్రతి రంగంలో ఆమె అడుగులు మరింత ధైర్యంగా వినిపిస్తున్నాయి. సమానత్వం ఒక హక్కు మాత్రమే కాదు, అది సమాజ అభివృద్ధికి పునాది. డిజిటల్ యుగంలో మహిళలు స్టార్టప్లు స్థాపిస్తూ, ఆవిష్కరణలకు నాయకత్వం వహిస్తున్నారు, గ్రామీణ స్థాయిలో స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు. ఈ సంవత్సరం థీమ్ – "డిజిటల్ సాధికారత" మహిళా పురోగతికి ప్రధాన బలం అయింది. ఆన్లైన్ విద్య, ఈ-కామర్స్, ఫిన్టెక్ సేవలు మహిళలను కొత్త అవకాశాల వైపు నడిపిస్తున్నాయి. ఆధునిక కాలంలో మహిళలు ప్రతి రంగంలో ముందంజలో ఉన్నారు. విద్య, వైద్యం, శాస్త్రసాంకేతికం, వ్యాపారం, రాజకీయాలు, క్రీడలు వంటి రంగాల్లో మహిళలు విశేష విజయాలు సాధిస్తున్నారు. దేశానికి రాష్ట్రపతి, ప్రధానమంత్రి వంటి అత్యున్నత పదవులు కూడా మహిళలు పోషిస్తూ, పురుషులకు గట్టి పోటి ఇవ్వడం గమనార్హం. మహిళలు కుటుంబ బాధ్యతలతో పాటు, సమాజ అభివృద్ధికి కూడా కీలక పాత్ర పోషిస్తున్నారు. "మహిళలు" ఆమెకు అవకాశమిస్తే, ప్రపంచం మారుతుంది." ప్రతి ఇంట్లో ఒక మహిళ విద్యావంతురాలైతే, ఆ కుటుంబం అభివృద్ధి చెందుతుంది. ప్రతి దశలో ఒక మహిళ నాయకత్వం వహిస్తుంది, ఆ సంస్థ విజయవంతమవుతుంది. ప్రతి దేశంలో మహిళలకు సమాన హక్కులు ఉంటే, ఆ దేశం శక్తివంతమవుతుంది. మహిళ అనేది సహనం, శక్తి, సృజనాత్మకతకు ప్రతీక. ఆమె కలలు కనడమే కాదు, వాటిని సాకారం చేయగల సామర్థ్యం కలిగిన నాయకురాలు. ఈ మహిళా దినోత్సవం సందర్భంగా చేయవలసింది ఒకటే. మహిళను గౌరవించడం తో సరిపోదు. మహిళకు సమానత్వం, సాధికారత ఇవ్వడం ప్రధానం. అదే దేశానికి, ప్రపంచానికి సుస్థిర అభివృద్ధి. ఇదే మహిళా దినోత్సవానికి నిజమైన అర్థం.

## భారతీయ మహిళల ఆధిక్యత:

భారతదేశంలో మహిళల పాత్ర అనేక గొప్ప మార్పులకు లోనౌతూ వచ్చింది. ఆధునిక భారత దేశంలో మహిళలు దేశ రాష్ట్రపతి, ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, లోక్ సభాపతి, ప్రతిపక్ష నాయకురాలు వంటి అత్యున్నత పదవులను అలంకరించారు. భారతదేశపు రాష్ట్రపతి కూడా ఒక మహిళ. గౌరవనీయులైన శ్రీమతి ద్రౌపతి ముర్ము, వీరు భారతదేశానికి రెండవ రాష్ట్రపతిగా సేవలందించడం మహిళాలోకానికి గర్వకారణం. మాతృస్వామ్యంలో అవతరించి పితృస్వామ్య వ్యవస్థకు మారింది దేశీయ సంస్కృతి. మహిళల సంఖ్య తగ్గుముఖం పడుతోంది. పురుషాధిక్యత పెరుగుతోంది. ప్రపంచంలో వేగంగావిస్తరిస్తున్న రెండో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థను కలిగి ఉన్న భారత్... స్త్రీ, పురుషుల ను సమానంగా చూసేవిషయంలో మాత్రం అట్టడుగున ఉందని ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) రూపొందించిన సూచి వెల్లడించింది. భారత్లో ఆడ శిశువులను గర్భంలోనే చంపేస్తున్నారని, కోట్లమంది ఆడపిల్లలు భూమ్మీదకు రాకముందే హత్యకు గురయ్యారని, నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్ వెలిబుచ్చిన ఆందోళనలను ఇది నిర్ధారించింది.

## మహిళా దినోత్సవం లక్ష్యం:

మహిళా దినోత్సవం రోజున మహిళల విజయాలను ఆనందంతో సంబరాలు జరుపుకుంటారు. ఈ సందర్భంగా స్త్రీ, పురుషులు సాంఘిక, ఆర్థిక, రాజకీయ సాంస్కృతిక కార్యక్రమాల్లో సమానమేననే భావనను ప్రచారం చేస్తున్నారు. ఐతే, నేటికీ ఈ సమాజంలో మహిళలకు ఎదురయ్యే సవాళ్లు అనేకం. "కడుపులో బిడ్డ ఆడా.. మగా అని తెలుసుకోవడంలో మొదలయ్యే వివక్ష, కష్టపడి.. గొడ్డు చాకిరీ చేసి.. తన జీవితమంతా పిల్లల కోసమే బతికి... చివరకు కాళ్లు, చేతులు కదలలేని పరిస్థితుల్లో.. వృద్ధాశ్రమానికి చేరుకునే వరకు 'ఆమె' పై వివక్ష అలానే కొనసాగుతుంది. దేశవ్యాప్తంగా భారతదేశంలో మహిళలపై అత్యాచారాలు, మానభంగాలు చేస్తున్న మృగాళ్ళు పాశవిక చర్యలకు పాల్పడి పరిణతి చెందని బాలికల్నిచెరబట్టి వేధించడం, అన్నెం పుణ్యం ఎరుగని, అప్పుడే పుట్టిన పసికందుల్ని సైతం బలిచేయడం సమాజం తలదించుకునే విధమైన ఘోరకలినీ వింటూ ఉన్నాం. ఏదో ఒకచోట ఇలాంటి దారుణ మారణ కాండలు చెలరేగుతూనే ఉన్నాయి. ఎన్ని చట్టాలు ఉన్నప్పటికీ ప్రభుత్వాలు దీనికి సరైన చట్టాలు రూపొందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఇప్పటికీ, లింగ వివక్ష, సైబర్ వేధింపులు, వేతన అసమానతలు కొనసాగుతూనే ఉండటం గమనార్హం. వీటన్నిటికి మహిళా దినోత్సవం ఒక బాధ్యతను గుర్తు చేస్తుంది: మహిళలను రక్షించడమే కాదు, వారికి సమాన అవకాశాలు కల్పించడం, నిర్ణయాల కేంద్రంగా మహిళలకు స్థానం కల్పించడం ద్వారా సమాజాన్ని సమగ్రంగా మార్పు చెందుతుంది.

ప్రతి సంవత్సరం మార్చి 8న ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని అంబరాన్ని అంటే విధంగా సంబరాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

ఈ మహిళా దినోత్సవం సందర్భంగా, భాద్యత వహించిన, నేడు ఆ బాటలో మహిళల హక్కులు, సాధికారత, సమానత్వం కోసం శతాబ్దాలుగా పోరాడిన, పోరాడుతున్న మహిళామణుల స్ఫూర్తిని, ఈ ప్రత్యేకమైన రోజున స్మరించుకుంటాం. వారిని సన్మానించుకోవడం స్ఫూర్తిదాయకం. అందరికీ, అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.

జై మహిళా! జై భారత్!



**-శారదా శృంగేరి**
94902 61119

## ప్రతిరోజూ ఆమెకే స్వంతం

మహిని తనలో నింపుకున్న మహిళ
ప్రకృతికి ప్రతిరూపం
సృష్టికి ప్రతి సృష్టి చేయు అపర బ్రహ్మ ఆమె
అమ్మతనం నుండి అంతరిక్షానికి ఎగిసినా
అవని వైపే తన చూపు
మూలాలను వదలని ఆలోచనలు
తన వారిని మాత్రమేగాక
లోకక్షేమాన్ని సంక్షేమాన్ని కాంక్షించే
మానవతకు మరో రూపం
ప్రేమను పంచడంలో అమ్మయితే
అన్యాయాన్ని ఎదిరించటంలో ఆదిపరాశక్తి
ఆదరణ చూపటంలో అమృతమూర్తి
మార్గదర్శనం చేయటంలో గురువు
అవరోధాలు అన్నిటినీ అధిగమిస్తూ
ప్రగతి పథంలో సాగిపోతున్న
మహిళామణులందరికి
ఈ ఒక్క రోజు మాత్రమే కాదు
మహిళా దినోత్సవ సంబరం
ప్రతిరోజు ఆమెకే స్వంతం
ఆమె లేని జగతి శూన్యం
వనిత జత లేని బ్రతుకు వ్యర్థం
అందుకే ప్రతి నిత్యం చేయాలి
ఆమెకు వందనాలు
అదే లోకానికి శ్రీరామరక్ష



**-డా.మైలవరపు లలితకుమారి**
9959510422

## శాత్రాజుపల్లి అంగన్వాడి కేంద్రంలో అన్నప్రాసన, అక్షరాభ్యాసం



రాజన్న సిరిసిల్ల, మార్చి 7: నేటినిజం (ప్రతినిధి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి అంగన్వాడి కేంద్రంలో శనివారం అంగన్వాడీ లెవల్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం, అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 2వ వార్డు కౌన్సిలర్ ఏనుగు జ్యోతి తిరుపతి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు అన్నప్రాసన చేయించి అక్షరాభ్యాసం ప్రారంభించారు. అనంతరం అంగన్వాడి కేంద్రంలోని పిల్లలకు యూనిఫాంలను పంపిణీ చేశారు.నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్ ఏనుగు జ్యోతి తిరుపతి రెడ్డిని అంగన్వాడి టీచర్లు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# బహుజనుల ఆత్మగౌరవ పతాక ఝల్కారీబాయి

### మహిళా దినోత్సవ సందర్భంగా



దేశ స్వాతంత్ర్య పోరాటంలో మహిళల త్యాగాలు, భాగస్వామ్యాలు కూడా మరువ లేనివి. అలాగే ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలోనూ ఒక త్యాగశీలి భాగస్వామ్యం చాలా మందికి తెలియనిది.

ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం అంటే వెంటనే గుర్తుకు వచ్చేది ఝాన్సీ రాణి. 1857వ సంవత్సరం సిపాయిల తిరుగుబాటు ఒక చరిత్ర. 1857లో ఆంగ్లేయుల పరిపాలనకు వ్యతిరేకంగా జరిగిన మొదటి భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రముఖ పాత్ర పోషించింది ఝాన్సీ లక్ష్మీబాయి. బ్రిటిష్ పాలనకు లొంగక, వారికి తన రాజ్యం స్వాధీన పరచడానికి ససేమిరా ఇష్ట పడక, రాజ్య రక్షణ కోసం జరిగిన యుద్ధంలో ఝాన్సీ వీరోచిత పోరాటం, వీర మరణం గురించి అందరికీ తెలిసిందే. ఈ పోరాటంలో ఝాన్సీ లక్ష్మీబాయికి నమ్మిన బంటుగా, విశ్వాస పాత్రురాలిగా, ఆత్మార్పణం గావించిన ఒక వీరదళిత నారి గురించి చాలా మందికి తెలియదు. ఆమె ఝల్కారీబాయి... ఝల్కారీబాయి గురించి తెలుసుకోక పోవడం చరిత్రకు అన్యాయం జరిగినట్లే భావించాలి.

ఉత్తర భారతదేశ రాజ్యమైన ఝాన్సీ అనే రాజ్యానికి రాణి లక్ష్మీ బాయి. 1857లో అలజడి రేగడంతో ఝాన్సీ పట్టణం విప్లవకారులకు నిలయంగా మారింది. లక్ష్మీబాయి స్వచ్ఛంద సైన్యాన్ని సమీకరించడం ద్వారా ఆత్మరక్షణ బలోపేతం చేసింది. మహిళలను కూడా సైన్యంలో చేర్చుకుని వారికి ఆయుధ శిక్షణను ఇవ్వనారంభించింది. ఆమె దగ్గర సైన్యాధ్యక్షులుగా ఉన్న వారంతా ఆమె యుద్ధం చేస్తున్న కారణానికి మద్దతుగా స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వారే. సెప్టెంబరు, అక్టోబరు 1857 లో ఆమె ప్రక్క రాజ్యాలైన దతియా, ఓర్చా రాజ్యాల నుంచి దాడిని విజయ వంతంగా ఎదుర్కొన గలిగింది.

హిందువులకు ఆవు పవిత్రం, ముస్లింలకు, పంది అసహ్యం. కానీ ఆంగ్లేయులు వాడే తూటాలకు ఆవుకొవ్వును, పందికొవ్వును వాడేవారు. అది సహించలేని సిపాయిలలో తిరుగుబాటు మొదలయ్యింది. ఇది గ్రహించిన ఆంగ్లేయులు హిందువులను, ముస్లింలను అనేక ఇబ్బందులకు గురిచేసారు. అది సహించలేని సిపాయిలు ఆంగ్లేయులపై తిరుగుబాటు చేయాలని సంకల్పించుకున్నారు. రాజ్యాన్ని ఆంగ్లేయులు ఆక్రమించుకోగా పారిపోయిన ఝాన్సీలక్ష్మీబాయి తాంత్యాతోపే మొదలైన తిరుగుబాటు దార్లతో చేయి కలిపి ఢిల్లీ, కాన్పూరు, ఔధ్ , ఝాన్సీతో పాటు అన్నీ ప్రాంతాలలో ఒకేసారి తిరుగుబాటు చేయాలని నిర్ణయించుకున్నారు. కానీ బ్రిటీష్ వారు పెట్టిన బాధలకు ఓర్వలేని

మంగల్ పాండే అనే భారత సిపాయి తిరుగుబాటు చేయడంపై ఆంగ్లేయులు అప్రమత్తమై ఝాన్సీరాణిని నిర్బంధించి ఝాన్సి రాజ్యాన్ని కైవసం చేసుకున్నారు. ఇది భారత చరిత్రలో మొదటి స్వాతంత్ర్య సంగ్రామం. భారతనారీ క్షేత్రంలో మచ్చుతునక ఝాన్సీ లక్ష్మీబాయి.

అయితే ఈ సమరంలో ఝల్కారీబాయి అనే వీరనారి పాత్ర మరువ లేనిది.

ఝల్కారీబాయి (నవంబరు 22, 1830 ? 1858) భారతీయ మహిళా సైనికురాలు. 1857 సిపాయి తిరుగుబాటు సందర్భంగా జరిగిన ఝాన్సీ యుద్ధంలో ప్రముఖ పాత్ర పోషించింది. ఆమె ఝాన్సీ లక్ష్మీబాయి సైన్యంలోని మహిళా విభాగంలో సైనికురాలు.

భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో సిపాయి తిరుగుబాటుగా, 'ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం'గా ప్రసిద్ధిగాంచిన 1857-58 నాటి వీరోచిత పోరాట ఘట్టంలో ఝాన్సీరాణి లక్ష్మీబాయికి ప్రతిరూపంగా కీలక భూమికను పోషించిన ఘనత దళిత బహుజన భూమి పుత్రిక ఝల్కారిబాయికే దక్కుతుంది. బుందేల్ఖండ్ ప్రాంతంలో ప్రజలు పాడుకునే జానపద బాణీల్లో ఝాన్సీలక్ష్మీబాయి సరసన ఝల్కారిబాయి సాహసాలను పాటల రూపంలో నేటికీ గుర్తు చేసుకోవడం విశేషం.

ఝాన్సీ సమీపంలోని భోజ్లా గ్రామంలో కోరీ కులానికి చెందిన సదోవర్ సింగ్, జమునాదేవి దంపతులకు నిరుపేద వ్యవసాయకూలీ కుటుంబంలో 1830 నవంబర్ 22న జన్మించిన ఝల్కారిబాయి వీరనారిగా ఎదిగి, నేడు దళిత బహుజనుల ఆత్మగౌరవ పతాకగా మారింది. చిన్న వయసులోనే తల్లి మరణించడంతో తండ్రి పెంపకంలో గుర్రపుస్వారీ, కత్తిసాము వంటి యుద్ధ విద్యలు నేర్చుకుంది. అడవిలో పశువులను మేపుతున్న ఝల్కారిపై దాడి చేసిన చిరుత పులిని కేవలం చేతికర్రతో చాకచక్యంగా హతమార్చిన ఘటన సంచలనం రేపింది. ఝాన్సీ లక్ష్మీబాయి సైన్యంలో ఆయుధ విభాగంలో పనిచేస్తున్న పూరణ్ సింగ్ను వివాహం చేసుకున్న ఝల్కారిబాయి, తదనంతర కాలంలో లక్ష్మీబాయికి సన్నిహితమై సైన్యంలో చేరి 'దుర్గావాహిని' మహిళా సాయుధ దళానికి నాయకత్వం వహించింది.

సిపాయి తిరుగుబాటు సందర్భంగా శత్రు సేనలతో జరిగిన యుద్ధంలో ప్రముఖ పాత్రను పోషించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోయింది. 1858 ఏప్రిల్ 3న బ్రిటిష్ జనరల్ హగ్ రోజ్ నాయకత్వంలో బ్రిటిష్ సేనలు ఝాన్సీ రాజ్యాన్ని చుట్టుముట్టాయి. ఆ దాడి నుంచి లక్ష్మీబాయి సురక్షితంగా తప్పించుకుని కల్పి ప్రాంతంలో పోరాడుతున్న తిరుగుబాటు నాయకులను కలుసుకోవడానికి అనువుగా, ఝల్కారీబాయి తానే ఝాన్సీ లక్ష్మీబాయినంటూ కోట ముందు ప్రత్యక్షమై బ్రిటిష్ సేనలను ముప్పుతిప్పలు పెట్టింది.

ఆ దాడిలో ఝాన్సీలక్ష్మీబాయి రూపంలో బందీగా పట్టుబడ్డ ఝల్కారిబాయిని గుర్తుపట్టిన బ్రిటిష్ సేనలు, తదనంతర కాలంలో ఆమెను విడిచిపెట్టారా లేదా చంపేశారా అన్నది చెప్పడానికి స్పష్టమైన ఆధారాలు లేవు. 1858 జూన్ 17,లో రెండో రోజు యుద్ధములో రాణి మరణించింది. ఈ ఝల్కారిబాయి సాహసంతో స్ఫూర్తి పొందిన దళిత బహుజన రాజకీయ పార్టీల కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ఝల్కారిబాయి జీవితాన్ని, పోరాట ఘట్టాలను నాటకాలు, కథలుగా మలచి ఊరూరా ప్రచారం చేయడం జరిగింది. భారత ప్రభుత్వం, ఆమె జ్ఞాపకార్థం పోస్టల్ స్టాంపును విడుదల చేయడం గమనార్హం.



**-రామ కిష్టయ్య సంగన భట్ల,**
9440595494

## ఓ మగువా! గెలవాలి.. గెలవక తప్పదనిపించాలి

ఓ మగువా!
గెలవాలి..గెలిచి చూపించాలి గెలవక తప్పదనిపించాలి
మగువా ఓ మగువా
"మేకల్ని మాత్రమే బలి ఇస్తారు..పులుల్ని కాదు"
భారత దేశ వేగుచుక్క అంబేద్కర్ ఉవాచ..మరచావా మగువా!
ఈ..ఘోరక్రూర కపట కర్కోటక మానవాకార
అగ్నిహోత్రోవధానులను మించినవారు
మసలుతోన్న..భారతావనిలో
స్త్రీలు.. శార్దూలం గా మారవలసిన తరుణం ఆసన్నమైంది..
మగువా
ఒక తెగువ- తెంపుతో ..తాబేలు గెలిచి చూపించలేదా!
"మూర్ఖంగా ఉండడంతో నే"పిరికితనం జయిస్తోంది
కారల్ మార్క్స్ నినాదం
మన స్త్రీజాతికి మకుటాయమానం ఆచరణీయం.
సాహిత్య వినీలాకాశంలో ధ్రువనక్షత్రం
అరుంధతీరాయ్ తిరుగుబాటు బావుటా ఎగుర వేయలేదా
కుటుంబ బాధలే ఆమె పాఠాలయి జీవనసమరం లో
రాటుదేలి...అక్షర అగ్ని జ్వాలలు సృష్టించలేదా.?!.
(ది గాడ్ఆఫ్ స్మాల్ తింగ్స్).
ఆనాటి వశిష్ఠుడు అరుంధతికి
కమండలం ఇచ్చి సరిపెట్టుకుంటే
ఈనాటి అరుంధతి
కమండలాన్ని అక్షర కరవాలంగా మార్చి
స్త్రీల ఆక్రందనలు ఛేదించలేదా..?!
పురుషాహంకార సమాజంపై..సాహిత్య వజ్రాయుధం విసిరి
అందరూ--యు టూ బ్రూటస్ లే...తండ్రి ఉన్నా లేనట్టే లెక్క.."
అని తనదైన విజయ రణభేరి మ్రోగించి చూపలేదా..?!
మగువా భయంవీడు.
నీ శ్రమఫలంతో.వినూత్న దారులు సృష్టించు
నీ కోసం నిండుగా నూరేళ్ళు జీవించు..కొత్త భాష్యం సృజించు
ఇలా ఇలాఈదినం నాహృదయంలో ఉప్పెనలా ఉప్పొంగుతున్న
నినాదాల భావాల మహోదయం లిఖించి
ప్రపంచ పటంపై మనదైన శాశ్వత చిరునామా
శిలాఫలకంచేసి మన స్వంత గొంతుతో
ప్రజ్వలించి పరాక్రమించి విస్తరించుదాం
నిరాఘాటంగా ఇదే ఇదే
నా ధ్యేయం మళ్ళీ మళ్ళీ ఉద్ఘాటిస్తూన్న
జైహింద్.




**-పత్తి సుమతి**
9108521585.

## కృష్ణవేణి టాలెంట్ ఆఫ్ స్కూల్స్లో మహిళా దినోత్సవ వేడుకలు

రాజన్న సిరిసిల్ల, మార్చి 7: నేటినిజం (ప్రతినిధి): కృష్ణవేణి టాలెంట్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్లో శనివారం ముందస్తుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకున్నారు. ఈ వేడుకలో పాఠశాల కరస్పాండెంట్ సన్నిధి వెంకటకృష్ణ ముఖ్య ప్రసంగం నిర్వహించి, నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాలలో ముందుండాలని, సమాజంలో వారి పాత్ర మరింత బలపడాలని పేర్కొన్నారు. అంతే కాక, ఆ సమయానందంతో అందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.విద్యార్థులు, సిబ్బంది, ఇతర పాల్గొనేవారు సృజనాత్మక కార్యక్రమాల ద్వారా ఈ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com